జనం కోసం - మన అక్షరం

# అక్షర వెలుగు

www.aksharavelugu.com

తెలుగు దిన పత్రిక

సోమ వారం
18.04.2022

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్
సంపుటి - 01, సంచిక-54
పేజీలు - 4 వెల రూ. 5

ఎడిటర్: గోసుకొండ వృద్ధిరాజు
aksharavelugudaily@gmail.com
8985893382

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak


# ఇంటి పార్టీయే తెలంగాణకు రక్ష

## వరంగల్ ఉమ్మడి జిల్లాల పర్యటనలో కేటీఆర్ విమర్శలు

- మోడీ వల్ల దేశానికి ఒరిగిందేమీ లేదు
- బిజెపి వాళ్లతో అయ్యేదిపొయ్యేది లేదు
- కెసిఆర్‌కు ఉన్న కడుపునొప్పి బిజెపి, కాంగ్రెస్‌లకు ఉండదు
- తెలంగాణలో రైతులకు 24 గంటల కరెంట్ ఇస్తున్నాం
- ఎన్నికలు లేకున్నా అభివృద్ధి, సంక్షేమం ఆగడం లేదు
- నర్సంపేట అభివృద్ధికి 50కోట్లు కేటాయింపు
- ఇక్కడ ఆహారశుద్ధి పరిశ్రమలను ప్రోత్సహిస్తాం
- నర్సంపేటలో ఇంటింటికీ తక్కువ ధరలకే గ్యాస్ సరఫరా
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు



**వరంగల్, ఏప్రిల్ 20 (అక్షర వెలుగు):** మోడీ వల్ల దేశానికి ఒరిగిందేమీ లేదని, బిజెపి వాళ్లతో అయ్యేదిపొయ్యేది కూడా లేదని మంత్రి కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ వల్ల గ్యాస్ సిలిండర్ ధర రూ.వెయ్యి దాటిందని మండిపడ్డారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి తక్కువ ధరకే ఇంటింటికీ వంటగ్యాస్ సరఫరా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే పెద్దిని మంత్రి కేటీఆర్ అభినందించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించిన కేటీఆర్ పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం నర్సంపేటలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భం గా ప్రధాని మోదీపై మంత్రి కేటీఆర్ మండిపడ్డారు. మోదీ చెప్పేవన్నీ గాలి మాటలేనని, పెట్రోల్ ధరలు పెంచారని దుయ్యబట్టారు. గ్యాస్ ధరలు తగ్గిస్తానన్న మోదీ డబుల్ చేశారని మండిపడ్డారు. 2 కోట్ల నిరుద్యోగులను బీజేపీ మోసం చేసిందని ధ్వజమెత్తారు. ఎన్నికలు లేకున్నా అభివృద్ధి, సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాలను ఎప్పటికీ కాపాడేదీ తెరాస మాత్రమేనని.. కేటీఆర్ అన్నారు. ప్రజల బాగోగుల గురించి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తప్ప.. విపక్ష నాయకులకు పట్టదని విమర్శించారు. నర్సంపేట నియోజకవర్గంలోని అశోక్ నగర్ వద్ద మెగా కంపెనీ ద్వారా ఇంటింటికీ గ్యాస్ అందుబాటులోకి వచ్చే విధంగా ఏర్పాటు చేసిన ప్లాంట్‌ను కేటీఆర్ ప్రారంభించారు. ఈ మేరకు సుదర్శన్ రెడ్డిపై ప్రశంసల జల్లు కురిపించారు. కేంద్రంలో ప్రధాని మోదీ గ్యాస్ సిలిండర్ రూ. వెయ్యికి పెంచితే... ఎక్కడా లేని విధంగా తక్కువ ధరకే ఎమ్మెల్యే పెద్ది సుదర్శనరెడ్డి గ్యాస్‌ను ఇంటింటికీ సరఫరా చేస్తున్నారని కొనియాడారు. రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలకూ తక్కువ ధరకే పంపిణీ చేస్తామని వెల్లడించారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ అభివృద్ధిలో ఒక్కో అడుగు ముందుకేసి వెళ్తున్నాం. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలు ఇక్కడ అమలవుతున్నాయి. గతంలో రైతులకు పెట్టుబడి ఇచ్చిన సీఎంలు ఎవరైనా ఉన్నారా. అని అన్నారు. రైతుబంధు కింద రైతులకు ఇప్పటికే

2

# ఆసరా పెన్షన్ల కోసం ఎదురుచూపు

### నిధులులేవంటున్న అధికారులు



**హైదరాబాద్, ఏప్రిల్ 20 (అక్షర వెలుగు):** జిల్లాల్లో కొత్తగా ఆసరా పింఛన్లు మంజూరు కావడంలేదు. వివిధ విభాగాల్లో అర్హులైన పేదలు దరఖాస్తులు చేసుకోవడమే తప్ప అనుమతులు రావడం లేదు. ఇదేంటని అధికారులను ప్రశ్నిస్తే ప్రభుత్వం నుంచి అనుమతులు లేవు. ఇందుకు ఆర్థిక ఇబ్బందులే కారణమని స్పష్టమవుతోంది. పింఛన్ మొత్తాన్ని గణనీయంగా పెంచడం, రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటంతో కొత్త వారికి పెన్షన్ అందే పరిస్థితి లేకుండా పోయింది. నిరుపేద లకు ఆసరాగా ఉంటామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. వృద్ధులు, వికలాంగులు, వితంతు వులు తమ కనీస అవసరాలు తీర్చుకునేందుకు ప్రభుత్వం ప్రతినెల ఆసరా పేరిట పింఛన్ విడుదల చేస్తోంది. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్ మొత్తాన్ని 2014 నుంచి గణనీయంగా పెంచుతూ వచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 2014లో ఏర్పాటైన టీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు ఆయా వర్గాలకు ఆసరా పింఛన్ల ను పెంచి అందిస్తోంది. అంతక ముందు వృద్ధులు, వితంతు వులు, తదితరులకు ఇచ్చే పింఛన్ మొత్తాన్ని ఏకంగా రూ.2000 వరకు పెంచా రు. ఆ మేరకు ఆసరా పెన్షన్ల పథకం నిర్విఘ్నంగా కొనసాగుతోంది. తెలంగాణ ఆసరా పింఛన్ పథకం ద్వారా వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, చేనేత కార్మికులు, గీతకార్మికులు, ఎయిడ్స్ బాధితులు లబ్దిపొందుతున్నారు. ఆసరా పథకానికి ప్రజల్లో మంచి ఆదరణ లభించడంతో 57 ఏళ్లవారికే ఇస్తామని ప్రకటించింది. ఇకపోతే వృద్ధులకు సహా ఆయా వర్గాలకు రూ.1000 ఉన్న ఆసరా పింఛన్‌ను రెట్టింపు చేస్తూ రూ.2016గా ఇస్తున్నారు. అలాగే వికలాంగులకు ఉన్న రూ.1500 పింఛన్‌ను రూ.3వేలకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పేరుకు తగిన విధంగా చేయూతనిస్తుండటంతో ప్రజల్లో మంచి స్పందన ఉంది. ప్రభుత్వం సూచించే అన్ని అర్హతలు ఉన్నందున తమకు ఆసరా పింఛన్ మంజూరు చేయాలంటూ జిల్లాల్లో దరఖాస్తులు చేసుకుంటున్నారు.

# గర్భిణిని మంచంపై ఆస్పత్రికి మోసుకెళ్లిన జవాన్

### రవాణా వ్యవస్థ లేక ఇబ్బందులు పడుతున్న జనం

- దంతేవాడలో గర్భిణికి సాయం చేసిన జవాన్
- ఆడపిల్లకు జన్మనిచ్చిన మహిళ



**దంతేవాడ, ఏప్రిల్ 20 (అక్షర వెలుగు):** మన దేశంలోని మారుమూల గ్రామాల్లో ఇప్పటికి రవాణా సదుపాయం లేదు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసీల బాధలు మాటల్లో చెప్పలేనివి. అక్కడ కనీసం నడవడానికి సరైన రోడ్డు కూడా ఉండదు. ఇక వారు సామాన్లు తెచ్చుకోవాలన్నా.. ఆస్పత్రులకు వెళ్లాలన్నా నడిచే వెళ్లాలి. ఎవరికైనా ప్రాణం మీదకు వచ్చినప్పుడు.. వారి పడే యాతన మామూలుగా ఉండదు. ప్రసవం సమయంలో గర్భిణీలను మంచంపై పడుకోబెట్టి దాంతోపాటు మోసుకెళ్తుంటారు. అలాంటి సమయంలో కొంచెం ఆలస్యమైనా ప్రాణాలకే ముప్పు ఏర్పడుతుంది. చత్తీస్‌గఢ్‌లోని దంతేవాడలో బుధవారం ఓ గర్భిణిని ఆస్పత్రికి తీసుకెళ్లాల్సి వచ్చింది. జిల్లా రిజర్వ్ గార్డ్ ఫోర్స్ జవాన్ వారికి సహాయం చేశారు. గ్రామస్థులతో కలిసి ఆయన దంతేవాడలో ఉన్న ఆస్పత్రికి చేరుకోవడానికి ఒక గర్భిణీని మంచం మీద మోసుకెళ్లారు. గ్రామంలోని అడవి బాటలో ప్రయాణిస్తూ అనేక కిలోమీటర్లు మోసుకుని తీసుకెళ్లారు. సకాలంలో ఆస్పత్రికి తీసుకెళ్లి ఆమెకు వైద్యం అందేలా చేశారు. ఆమెకు ఆడపిల్ల జన్మించింది. పసిబిడ్డ, మహిళకూ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో ట్విట్టర్‌లో షేర్ చేయగా ఎంతోమంది హృదయాలను తాకుతుంది. గతంలో చత్తీస్‌గఢ్‌లోనే ఇలాంటి సంఘటన జరిగింది. బీజాపూర్, పేదాడ గ్రామంలో సీఆర్‌పీఎఫ్ జవాన్లు ఓ గర్భిణీకి సహాయం చేశారు.. తన ఉద్యోగంలో భాగంగా పెట్రోలింగ్‌కు వెళ్లిన సీఆర్‌పీఎఫ్ జవాన్లకు ఓ ఇంట్లో అనారోగ్యంతో ఉన్న మహిళ కనిపించింది. ఆమెకు వైద్యం అందించాలనుకున్నారు. వెంటనే కంపెనీ కమాండ్ అవినాష్ రాయ్ ఫస్ట్ ఎయిడ్ చేసే తన టీమ్‌ను ఆమె దగ్గరకు తీసుకెళ్లాడు. ఆమెకు నొప్పులు వస్తున్నాయని, వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాలని చెప్పారు. దాంతో జవాన్లు ఆమెను ఆస్పత్రికి తరలించేందుకు ఏర్పాట్లు

2

## లాభాలతో దూసుకెళ్లిన మార్కెట్..

- 20 శాతం పెరిగిన స్టాక్స్ ఇవే!
- మార్కెట్ నష్టాలకు బ్రేకులు పడ్డాయి
- లాభాలతో దూసుకుపోయిన సూచీలు
- సెన్సెక్స్ 500 పాయింట్లకు పైగా ర్యాలీ
- నిఫ్టీ కూడా ఇదే దారిలో పయనిస్తోంది

2

## బుధవారం భానుడి భగభగలు

- సౌరజ్వాలలతో విరుచుకుపడ్డ సూర్యుడు
- ఢిల్లీలో అత్యధికంగా మండుటెండలు

2

## లూధియానాలో ఘోర అగ్నిప్రమాదం

- ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు మృతి
- దంపతులు ఐదుగురు చిన్నారుల సజీవదహనం

2

## ఏకాభిప్రాయంతోనే కుటుంబ ఆస్తి బదలాయింపులు

- సొంతంగా నిర్ణం తీసుకునే హక్కు ఏ ఒక్కరికీ లేదు
- సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ

2

## బ్రిటన్ ప్రధాని బోరిస్ పర్యటన ఖరారు

### అధికారికంగా ప్రకటించిన ప్రధాని కార్యాలయం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 20 (అక్షర వెలుగు):** బ్రిటన్ ప్రధానమంత్రి బోరిస్ జాన్సన్ భారత్ పర్యటన అధికారికంగా ఖరారయ్యింది. భారత్‌తో బ్రిటన్ ప్రధాని ఎన్ని రోజులు పర్యటిస్తారు, ఏయే తేదీల్లో పర్యటిస్తారు, ఎక్కడ పర్యటిస్తారనే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈనెల 21, 22 తేదీల్లో బోరిస్ పర్యటన ఉంటుందని బుధవారం ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది. 21 ముందుగా ఆయన అహ్మదాబాద్‌కు చేరుకుని అక్కడి నుంచి ఢిల్లీకి బయల్దేరనున్నారు. అనంతరం ఏప్రిల్ 22న రాజ్‌ఘాట్‌కు వెళ్లి గాంధీ సమాధి వద్ద నివాళులు అర్పించి, విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జయశంకర్‌ను కలుసుకోనున్నారు. ఆ తర్వాత ప్రధానమంత్రి నరేంద్రమోదీతో సమావేశమై తిరిగి లండన్ వెళ్లనున్నట్లు ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది. బ్రిటన్ ప్రధానమంత్రిగా బోరిస్ ఇంత వరకు భారత్‌కు రాలేదు. అంతే కాదు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ సైతం బోరిస్ ప్రధానిగా ఎన్నికైనప్పటి నుంచి బ్రిటన్‌కు వెళ్లలేదు. ఆయన గతంలోనే భారత్‌కు రావాల్సి ఉంది. మళ్లీ ఏప్రిల్‌లో పర్యటన ఖరారు కాగా.. ఈసారి భారత్‌లో కరోనా కేసుల పెరుగుదల నేపథ్యంలో రద్దయ్యింది. మళ్లీ ఇన్నాళ్లకు భారత పర్యటన ఖారారైంది.


# రాజస్థాన్‌లో దారుణం

### రేడియంట్ వార్మ్‌లు వేడెక్కి ఇద్దరు చిన్నారుల మృతి

**జయపుర, ఏప్రిల్ 20 (అక్షర వెలుగు):** రాజస్థాన్ రాష్ట్రంలోని బీవార్ సిటీలో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిలో ఘోరం జరిగిపోయింది. ప్రభుత్వ ఆస్పత్రిలో కరెంట్ పోవడంతో ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. పవర్ కట్ తర్వాత వోల్టేజ్ హెచ్చుతగ్గుల కారణంగా రేడియంట్ వార్మర్‌లు వేడెక్కడంతో ఇద్దరు నవజాత శిశు వులు మరణించారు. 11, నాలుగు రోజుల వయస్సు గల ఇద్దరు శిశువులు బీవార్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో మరణించారు. వార్మర్‌కు తగిన వోల్టేజ్ 230 వోల్ట్‌లు అయితే హెచ్చుతగ్గుల తర్వాత అది 332 వోల్ట్‌లకు చేరుకుందని కుటుంబ సంక్షేమ డైరెక్టర్ డాక్టర్ కెఎల్ మీనా తెలిపారు. ఈ ఘటనతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

## ఆరుతడి పంటలతో లాభాలు ఆర్జించండి

- తెలంగాణ ప్రభుత్వానికి సహకరించండి
- రైతులకు తుంపరసేద్యం పరికరాల అందచేత
- దేశంలో 24 గంటల కరెంట్ అదిస్తున్నది మనమే
- అంబేడ్కర్ ఆలోచనలతో ముందుకు సాగాలి
- పలు కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి హరీష్ రావు



**సిద్దిపేట, ఏప్రిల్ 20 (అక్షర వెలుగు):** వ్యవసాయ రంగం బలోపేతానికి ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. ఎక్కడా లేనివిధంగా రైతులకు ఉచితంగా 24గంటల కరెంట్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని అన్నారు. అలాగే అనేక విధాలుగా రైతాంగానికి అండగా నిలిచినట్లు పేర్కొన్నారు. రైతులు ఆరుతడి, వాణిజ్య పంటలు పండించి లాభాలు పొందాలని సూచించారు. జిల్లాలోని చిన్నకోదూర్ మండలం చనీదలాపూర్ గ్రామంలో 143 మంది రైతులకు జెడ్పీ చైర్మన్ రోజా శర్మతో కలసి తుంపర సేద్య పరికరాలు, ప్రొసీడింగ్ కాపీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ..దేశంలోని గుజరాత్, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కరెంటు కోతలు ఉన్నాయన్నారు. కానీ తెలంగాణలో కరెంట్ కోతలు లేవని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో ఒక్క యూనిట్ కు రూ.20 రూపాయలు ఖర్చు పెట్టి రైతులకు ఉచితంగా నిరంతర కరెంటు అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గ పరిధిలోని రైతులకు 4 వేల తుంపర సేద్య పరికరాలు పంపిణీ చేశామని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతు శ్రేయస్సు కోసం పాటుపడుతున్న టీఆర్ఎస్ ప్రభుత్వానికి అన్నదాతలు సహకరించాలన్నారు. ఆయిల్ ఫామ్ పంటలు

2

# రాజ్యంగా విలువల విధ్వంసం జరుగుతోంది

### బిజెపి తన మనసులోని విద్వేషాన్ని బుల్‌డోజ్ చేసుకోవాలి

### ట్విట్టర్లోఓ కేంద్రంపై రాహుల్ విమర్శలు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 20 (అక్షర వెలుగు):** దేశ రాజధాని నగరం ఢిల్లీలోని జహంగీర్‌పురిలో చట్టవిరుద్ధ ఆక్రమణలను తొలగించేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టిన నేపథ్యంలో బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భారత దేశ రాజ్యాంగ విలువల విధ్వంసం జరుగుతోందని బుధవారం ఇచ్చిన ట్వీట్‌లో మండిపడ్డారు. పేదలు, మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వమే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. దీనికి బదులుగా బీజేపీ తన మనసులోని విద్వేషాన్ని బుల్డోజ్ చేసుకోవాలని హితవు పలికారు. భారత రాజ్యాంగాన్ని ఓ బుల్డోజర్ ధ్వంసం చేసే ప్రయత్నం చేస్తున్నట్లు అర్థం వచ్చే విధంగా ఓ ఫొటోను ఈ ట్వీట్‌కు జత చేశారు. రాజ్యాంగ ప్రవేశిక, బుల్డోజర్ ఫొటోలను పెట్టారు. బుధవారం ఉదయం జహంగీర్‌పురిలోని చట్టవిరుద్ధ ఆక్రమణలను తొలగించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. దీనికి ఢిల్లీ పోలీసులు కట్టుదిట్టమైన భద్రత కల్పించారు. అయితే ఈ కార్యక్రమాన్ని నిలిపేయాలని సుప్రీంకోర్టు ఎంసీడీని ఆదేశించింది. యథాతథ స్థితిని కొనసాగించాలని, తదుపరి విచారణ గురువారం జరుగుతుందని పేర్కొంది. ఆక్రమణలను తొలగించడం కోసం నగర పాలక సంస్థ అధికారులు చేపట్టిన కార్యక్రమాన్ని ఆపాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఏఐఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ బుధవారం ట్విటర్ వేదికగా వేర్వేరుగా డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడుతూ, విద్వేషంతో కూడిన

2

# రైసుమిల్లుల్లో ధాన్యం గోల్‌మాల్

- 4,53,890 సంచుల ధాన్యం మాయం
- ఎఫ్‌సిఐ దాడుల్లో వెల్లడైన వివరాలు
- గోనెసంచులు లేకుండా ఎలా సేకరిస్తారు
- రైతులను మోసం చేస్తున్న సిఎం కెసిఆర్
- మీడియా సమావేశంలో మండిపడ్డ కిషన్ రెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్ 20 (అక్షర వెలుగు):** తెలంగాణలోని కొన్ని రైస్ మిల్లుల్లో అవకతవకలు జరుగుతున్నాయని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. ధాన్యం సేకరణను ప్రభుత్వం ఇప్పటికీ చేపట్టలేదన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కొన్ని రైస్ మిల్లుల్లో ఉండాల్సిన ధాన్యం లేదన్నారు. ఎఫ్‌సీఐ దాడుల్లో 4,53,890 సంచుల ధాన్యం తక్కువ ఉందని, అవి ఎక్కడికి పోయాయో టీఆర్ఎస్ ప్రభుత్వం చెప్పాలని ప్రశ్నించారు. తక్కువైన ధాన్యంపై రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రమత్తం చేశామన్నారు. అన్ని రైస్ మిల్లులలో తనిఖీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశాం. రైస్ మిల్లులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో త్వరలో లేఖ రాస్తాం. ధాన్యం కొనాలని సివిల్ సప్లై కార్యదర్శి కేంద్రానికి లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను కేంద్రం ఆమోదించింది. రైతుల నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఇంకా ధాన్యం కొనలేదని కిషన్‌రెడ్డి విమర్శించారు. అలాగే గన్నీ బ్యాగుల సేకరణ కూడా డిమాండ్‌కు తగ్గట్లుగా చేపట్టడం లేదన్నారు. తండ్రీకొడుకులు కలిస తట్టల్లో తీసుకొస్తారా అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కొన్ని రైస్ మిల్లుల్లో అవకతవకలు జరిగాయని గుర్తించి ఎఫ్‌సీఐ అధికారులు 40 రైస్ మిల్లుల్లో తనిఖీలు చేయగా.. 4,53,890 సంచుల బియ్యం తక్కువగా ఉన్నట్లు తేలిందని చెప్పారు. అవి ఎలా మాయమయ్యాయో కేసీఆర్ సర్కారు చెప్పాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. మాయమైన

2

అక్షర వెలుగు
www.aksharavelugu.com తెలుగు దిన పత్రిక
గురు వారం | 21 | ఏప్రిల్ | 2022
www.aksharavelugu.com


# సంపాదకీయం

## వ్యవసాయాన్ని గట్టెక్కించే దారేది?

ఏటా దేశంలో రైతులు పంటలు పండించి గిట్టుబాటు ధరల కోసం రోడ్డెక్కాల్సిన దుస్థితి నెలకొంది. గిట్టుబాటు ధరలు ఇవ్వకుండా ఇతరత్రా తాయిలాలు ప్రకటిస్తూ ప్రభుత్వాలు రైతన్నలను మోసం చేస్తు న్నాయి. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని..మార్కెట్‌కు తీసుకుని వచ్చిన పంటలను సకాలంలో కొనుగోలు చేయాలన్న రైతులకు నిరాశే ఎదురవుతోంది. ప్రధానంగా వరి,కంది, మిర్చి, పత్తి, ఎర్రజొన్న, పసుపు రైతులు బాధలు వర్ణనాతీతం. సన్నకారు రైతులకు అండగా ఉన్నానని,ఏటా 6వేల కోట్లు వారి ఖాతాల్లో వేస్తున్నానని ప్రధాని మోడీ తన గుజరాత్ పర్యటనలో ప్రకటించారు. నిజానికి ఖాతాల్లో డబ్బులు వేయడం కాకుండా వ్యవసాయాన్ని ఎలా ముందుకు తీసుకుని వెళ్లాలో ఆలోచించడం లేదు. సాగుచట్టాల ను రద్దు చేశాక నేటికీ సమగ్ర వ్యవసాయ విధానంపై ఆలోచన చేయడం లేదు. దీనిపై సమగ్రంగా చర్చిం చాలన్న ధోరణి కానరావడం లేదు. ఇకపోతే దేశంలో సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేలా ప్రచారం కానరావడం లేదు. కొంతమంది రైతులు ఎరువులు ఎక్కువ వేస్తే దిగుబడి పెరుగుతుందని అనుకోవడం వల్ల మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడుతున్నారు. దీంతో భూసారం దెబ్బతింటోంది. నిజానికి గ్రామాలను ఆధారం చేసుకుని వ్యవసాయాన్ని పాడి పరిశ్రమను, కోళ్ల పరిశ్రమను ఉమ్మడిగా అభివృద్ధి చేయాలి. దీంతో గ్రామీణ వృత్తులకు కూడా ఆసరా దక్కుతుంది. కానీ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా ఆలోచన చేయడం లేదు. అకాల వర్షాల కారణంగా భారీగా పంటలు దెబ్బతింటున్న సందర్భంలో వారికి సకాలంలో పరిహారం అందడం లేదు. ప్రభుత్వ లెక్కల ప్రకారం 33 శాతానికంటే ఎక్కువ మొత్తంలో పంటలు దెబ్బతింటేనే నష్టపరిహారానికి సిఫార్సు చేసి ప్రభుత్వానికి నివేదిస్తారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరుగుతున్న నష్టం లెక్కల్లోకి రావడం లేదు. పంటనష్టం అంతకు మించి ఉంటేనే వ్యవసాయాధి కారులు వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తున్నారు. గత కొన్నేళ్లుగా బీమా చేస్తున్న రైతులకు పరిహారం అందేది నామమాత్రంగానే ఉంటుంది. వేల సంఖ్యలో రైతుల పంట నష్టం జరిగినా, రైతులకు అందుతున్నది మాత్రం తక్కువగానే ఉంటుంది. వర్షాలు కురియడం,పంటను నష్ట పోవడం కారణంగా రైతులు ఆందోళన చెందుతున్నా అందడం లేదు. బీమా నిబంధనల ప్రకారం నష్టం 33 శాతం దాటితేనే పరిహారం వచ్చే అవకాశం ఉంది. ఈ నిబంధనలను మార్చాల్సి ఉంది. ఇన్సూరెన్స్ ఉన్న రైతులందరికి పరిహారం దక్కడం లేదు. భారీ వర్షాలతో నష్టపోతే రుణాలు తీసుకున్నవారికి ఈ బీమాను అమలు చేయక పోవడంతో రైతులపై అదను భారం పడుతోంది. నిబంధనల ప్రకారం ఐదేళ్ల ఉత్పత్తి ఆధారంగా ఎంత పంటనష్టం జరిగితే అంతే మొత్తాన్ని అందించనున్నారు. అకాల వర్షాలు భారీగా పంట నష్టాన్ని కలిగించి, రైతుకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. చేతికి వచ్చిన పంటను కాపాడు కునేందుకు రైతులు ఎంత ప్రయత్నించినా సాధ్యం కావడం లేదు. అకాల వర్షాల కారణంగా పంటలు ఉన్నా..వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు మాత్రం నేతలు ముందుకు రావడం లేదు. తెలంగాణలో 24 గంటల ఉచిత విద్యుత్...నీటి సరఫరా, రైతుబందు కింద పెట్టుబడి సాయం...రైతు చనిపోతే కుటుంబాన్ని ఆదుకునేందుకు రైతుబీమా పథకం అమలవుతున్నాయి. మిషన్ కాతీయ తదితర పథకాలతో చెరువుల్లో నీరు పెరిగి పంటల దిగుబడి పెరిగిందని ప్రభుత్వమే చెబుతోంది. ఇన్ని పథకాలు ప్రవేశ పెట్టి పంటలు కొనుగోలు చేయకపోతే ఎలా? పంటలు అమ్ముకోవడానికి రైతులు రోడ్డెక్కితే రాజకీయం ఎలా అవుతుంది.? గిట్టుబాటు ధరలు ఇవ్వాలని, పంటలు కొనుగోలు చేయాలని కోరుకోవడం ఏటా ఓ ప్రహసనంగా మారింది. ఇది ఒక్క తెలంగాణ సమస్య కాదు. దేశవ్యాప్తంగా ఉన్న సమస్య. సీజన్ లో సకాలంలో పంటలు కొనుగోలు చేసి డబ్బులు ముట్టచెప్పితే చాలు.. రైతు సమస్యలు సగం తీరినట్లే. కానీ మార్కెట్ యార్డుల్లో పడిగాపులే రైతులను తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది. దానికితోడు గిట్టుబాటు ధరలు రావు. అన్నీవున్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా కొనుగోళ్ల విషయంలో అటు కేంద్రం,ఇటు రాష్ట్రం పెద్దగా కార్యాచరణ చేపట్టడంలేదు. పంట ఏదైనా డిమాండ్ ఉండదు. అమ్ముకోవడానికి నానా కష్టాలు పడాల్సిందే. కెసిఆర్ ప్రవేశ పెట్టిన రైతుబంధును ప్రవేశ పెట్టిన కేంద్ర ప్రభుత్వం..పంటల కొనుగోళ్లకు సంబంధించి నిర్దిష్ట విధానాలు అమలు చేయడం లేదు. మార్క్‌ఫెడ్, సిసిఐలు రంగంలోకి దిగినా ఫలితం దక్కడంలేదు. కేంద్ర ప్రభుత్వం ఈ-నామ్ అంటూ అట్టహాసంగా ప్రకటనలు చేసినా రైతులకు మేలు చేకూర్చలేదు. పంటలను గిట్టుబాటుధరకు రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏటా రైతులు రోడ్డెక్కడం..దాన్ని ప్రభుత్వాలు పట్టించుకోక పోవడం మామూలు విషయంగా మారింది.గిట్టుబాటు ధరలతో పాటు కొనుగోళ్ల కోసం పలుమార్లు ఆందోళనలు చేపట్టినా ప్రభుత్వం నుంచి స్పందన కరువవడంతో రైతులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. పంటలు మార్కెట్‌కు వచ్చే సమయంలో పక్కాగా కొనుగోళ్లు సాగాలి. గిట్టుబాటు ధరలు దక్కాలి. దళారుల మోసాలు అరికట్టాలి. ఏటా పంట ఏదయినా జిల్లాల్లో పండించిన పంటలను కొనేలా కార్యాచరణ సాగాలి. ఇదంతా కూడా పక్కాగా ప్రణాళిక మేరకు సాగాలి.

**పృధ్విరాజ్ గోసుకొండ**
**ఎడిటర్**

## రాజ్యంగా విలువల విధ్వంసం జరుగుతోంది

(మొదటి పేజీ తరువాయి..) బుల్డోజర్స్‌ను ఆపాలని, పవర్ ప్లాంట్స్‌ను స్విచాన్ చేయాలని డిమాండ్ చేశారు. ఆక్రమణల పేరుతో ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్ రాష్ట్రాల్లో మాదిరిగానే ఢిల్లీలో కూడా ఇళ్ళను ధ్వంసం చేయాలని చూస్తోందన్నారు. చట్టవిరుద్ధ ఆక్రమణల విషయంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వైఖరి అనుమానాస్పదంగా ఉందని మండిపడ్డారు. జహంగీర్ పురిలోని అక్రమ ఆక్రమణలను తొలగించడంలో కేజ్రీవాల్ ప్రభుత్వంలోని పీడబ్ల్యూడీ శాఖ కూడా పాల్గొంటోందా అని ప్రశ్నించారు. ఇలాంటి నమ్మక ద్రోహం చేస్తారని, పిరికితనంతో వ్యవహరిస్తారని ఆయనకు ఈ ప్రాంత ప్రజలు ఓటు వేశారా? అని ప్రశ్నించారు. ఆయన తరచూ పోలీసులులు తన నియంత్రణలో లేరని చెప్తున్నారని, ఈ సాకు ఇక్కడ పని చేయదని మండిపడ్డారు. ఈ విషయంలో చట్టబద్ధత, నైతికత ఎంత మాత్రం లేవన్నారు. నిస్సహాయ పరిస్థితులు ఉన్నాయన్నారు. దేశంలో బొగ్గు కొరతను రాహుల్ బుధవారం ఇచ్చిన ట్వీట్‌లో ప్రస్తావించారు. అత్యధిక ద్రవ్యోల్బణం, తీవ్రమైన నిరుద్యోగం ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆరోపించారు. ఎనిమిదేళ్ళపాటు గొప్ప గొప్ప మాటలు చెప్పారని, ఇప్పుడు కేవలం ఎనిమిది రోజులకు సరిపడిన బొగ్గు నిల్వలు మాత్రమే ఉన్నాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. విద్యుత్తు కోతల వల్ల చిన్నతరహా పరిశ్రమలు తీవ్రంగా దెబ్బతింటాయని, ఫలితంగా ఉపాధి అవకాశాలను కోల్పోవలసి వస్తుందని చెప్పారు.

## రైసుమిల్లుల్లో ధాన్యం గోల్‌మాల్

(మొదటి పేజీ తరువాయి..) బియ్యంపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని అన్నారు. తక్కువైన ధాన్యంపై ప్రభుత్వాన్ని అలర్ట్ చేశామని.. రాష్ట్రంలోని అన్ని రైస్ మిల్లుల్లో తనిఖీలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసినట్లు చెప్పారు. ధాన్యం కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కావాలనే ఘర్షణ వాతావరణం సృష్టించిందని కిషన్ రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ సర్కారు ఇప్పటి వరకు రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయలేదని విమర్శించారు. బాయిల్డ్ రైస్ కొనే ప్రసక్తేలేదని కేంద్రం అన్ని రాష్ట్రాలకు లేఖ రాసిందని, అయినా కేసీఆర్ ఉద్దేశపూర్వకంగా ప్రధానిని తిడుతూ దేశం నుంచి తరిమికొడతామని పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని కిషన్ రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్ సర్కారు రాజకీయ ప్రయోజనాల కోసం రైతుల జీవితాలతో ఆడుకుంటోందని కిషన్ రెడ్డి ఫైర్ అయ్యారు. 40లక్షల మెట్రిక్ టన్నుల రా రైస్ ఇస్తామని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసిందని, అయితే ధాన్యం సేకరణకు రాష్ట్రంలో అసలు గోనె సంచులే లేవని చెప్పారు. ప్రస్తుతం వడ్ల కోసం15కోట్ల గోనె సంచులు అవసరమన్న ఆయన.. జనవరి నుంచి వాటి కొనుగోలు మొదలుపెట్టాల్సి ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం ఆ పని చేయలేదని విమర్శించారు. అసలు గోనె సంచులే లేనప్పుడు తండ్రీ కొడుకులు వడ్లను తట్టలో తీసుకొస్తరా అని సటైర్ విసిరారు.

## ఢిల్లీలో మళ్లీ మాస్క్ తప్పనిసరి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 20 (అక్షర వెలుగు):** ఇటీవల దేశ రాజధాని ఢిల్లీలో కరోనా కేసులు మళ్లీ పెరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఢిల్లీ మున్సిపాల్టీ కొత్త ఆదేశాలు జారీ చేసింది. మాస్క్ ధరించడం తప్పనిసరి చేసింది. ఒకవేళ ఎవరైనా మాస్క్ పెట్టుకోకుంటే, వారిపై రూ.500 జరిమానా విధించనున్నట్లు డీడీఎంఏ ఆదేశించింది. కొన్ని స్కూళ్లలో కొత్తగా కేసులు నమోదు అవుతున్నా.. స్కూళ్లను మాత్రమే మూసివేసేది లేదని అధికారులు చెబుతున్నారు.

## పాదయాత్రలో భాగంగా ఇంటింటికి ఇందీరా శోభన్

**హైదరాబాద్, ఏప్రిల్ 20 (అక్షర వెలుగు):** బుధవారం ఉదయం 10గంటలకు అయిదో రోజు పాదయాత్రలో భాగంగా ముషీరాబాద్ నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అడ్డాకూలిలుగా పనికోసం రోజు దొలాడుకుని పొట్ట పోసుకునే మాకు, తమ బతుకులు మారిపోతాయన్న కార్మికులు కలలు ఆవిరై పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాదయాత్ర లో భాగంగా ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శ్యామ్ ప్రసాద్ నగర్ బస్తీ లో , భగత్ సింగ్ నగర్ బస్తీ లో నెహ్రూ నగర్ 1, నెహ్రూ నగర్ 2 తరతరాలుగ ఇరుకు గల్లిలలో గల్లి సైజు ఇండ్లలో బ్రతుకు సాగదిస్తున్నమని వాపోయారు తమకు ఇంతవరకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించలేదని తెలిపారు, చాలామందికి ఆసరా పెన్షన్ లభించడం లేదని తెలిపారు, డ్రైనేజ్ సిస్టం, త్రాగునీరు సరఫార సమస్యల వల్ల ఇబ్బందులు పడుతున్నమని తెలిపారు, రాష్ట్ర రాజధానిగా చెప్పుకునే హైదరాబాద్ అనేక సమస్యలకు నిలయంగా మారిందని, ఎవరూ పట్టించుకునే పరిస్థితి లేదని వాపోయారు. ముషీరాబాద్ అసెంబ్లీ నియజకవర్గము చిక్కడ పల్లి వెంకటేశ్వర కమాన్ ఎక్స్ రోడ్ నుంచి మొదజలైన పాదయాత్ర. సూర్య నగర్, సర్వోదయ నగర్, శ్రీరామ్ నగర్, భగత్ సింగ్ నగర్, నల్లకుంట అచ్చయ్య నగర్ వరకు మొత్తము 15 కిలోమీటర్‌లు కొనసాగింది. రాబోయే రోజుల్లో హైదరాబాద్‌లో నెలకొన్న స్థానిక సమస్యల పరిస్కారం కోసం ఆమ్ ఆద్మీ పార్టీ ప్రజల పక్షాన పోరాడుతుందని ప్రకటించారు. ఢిల్లీలో కేజ్రీవాల్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి చూసి, ఆమ్ ఆద్మీ పార్టీలో చేరేందుకు పెద్ద ఎత్తున యువకులు, విద్యావేత్తలు, మేధావులు ముందుకు వస్తున్నారని చెప్పారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షలు నెరవేరాలంటే మరో ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. సామాన్యుడికి అధికారం అప్పగించేందుకు ముందుకు వస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ ప్రజలు అక్కున చేర్చుకోవాలని కోరారు. అయిదో రోజు పాదయాత్రలో ఆమ్ ఆద్మీ పార్టీ పట్ల ప్రజలు చూపించిన ఆదరణకు ధన్యవాదాలు తెలిపారు. ఈ పాదయాత్రలో ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు, వాలంటీర్లు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఆమ్ ఆద్మీ పార్టీలో కార్యకర్తల చేరికలు





## లాభాలతో దూసుకెళ్లిన మార్కెట్..

**ముంబయి, ఏప్రిల్ 20 (అక్షర వెలుగు):** స్టాక్ మార్కెట్ లాభాల్లో క్లోజ్ అయ్యింది. కొన్ని రోజులుగా పడిపోతూ వచ్చిన షేర్ మార్కెట్ ఈరోజు దూసుకుపోయింది. బెంచ్‌మార్క్ ఇండెక్స్‌లు రెండూ లాభాల్లోనే ఉన్నాయి. సెన్సెక్స్ 500 పాయింట్లకు పైగా ర్యాలీ చేసింది. నిఫ్టీ కూడా పైకి కదిలింది. మరోవైపు మార్కెట్‌లో కొన్ని తక్కువ ధర షేర్లు అప్పర్ సర్క్యూట్ తాకాయి. ఒకే రోజు 19 శాతానికి పైగా లాభపడ్డాయి. దీంతో ఈ షేర్లలో డబ్బులు పెట్టిన వారి పంట పండింది. మధ్యాహ్నం ట్రేడింగ్ గమనిస్తే బెంచ్‌మార్క్ సూచీలు లాభాలతో కదలాడుతున్నాయి. ఆటోమొబైల్, ఆయిల్ అండ్ గ్యాస్ షేర్లు జోరు మీద ఉన్నాయి. నిఫ్టీ 17,100 పాయింట్ల వద్ద ఉంది. బుధవారం యూరోపియన్ మార్కెట్లు పెరిగాయి. ఇన్వెస్టర్లు ఉక్రెయిన్ రష్యా ఉద్రిక్తతలను గమనిస్తున్నారు. అలాగే ఐఎంఎఫ్ తాజా గ్లోబల్ ఎకనమిక్ అంచనాలను పరిగణలోకి తీసుకున్నారు. బీఎస్ఈ సెన్సెక్స్ 3.15 సమయంలో 567 పాయింట్లు పెరిగింది. 57,030 పాయింట్ల వద్ద ట్రేడ్ అవుతోంది. సెన్సెక్స్ మిడ్ క్యాప్ కూడా 102 పాయింట్ల లాభంతో 24,557 పాయింట్లకు ఎగసింది. బీఎస్ఈ స్మాల్ క్యాప్ 108 పాయింట్లు పెరిగింది. 28,977 పాయింట్ల వద్ద ఉంది. బీఎస్ఈ సెన్సెక్స్‌లో అల్ట్రా టెక్ సిమెంట్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఏసియన్ పెయింట్స్, మారుతీ సుజుకీ, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. నిఫ్టీ 50 ఇండెక్స్ 164 పాయింట్లు పైకి కదిలింది. 16,958 పాయింట్ల వద్ద ఉంది. బ్యాంక్ నిఫ్టీ మాత్రం 74 పాయింట్లు నష్టపోయింది. 36,267 వద్ద కదలాడుతోంది. నిఫ్టీ 50 ఇండెక్స్‌లో టాటా మోటార్స్, ఐషర్ మోటార్స్, బీపీసీఎల్, శ్రీ సిమెంట్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు టాప్ గెయినర్లుగా ఉన్నాయి.

## బుధవారం భానుడి భగభగలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 20 (అక్షర వెలుగు):** భానుడు బుధవారం భగభగా మండాడు. ఉదయం ఒక్కసారిగా భారీ స్థాయిలో సౌరజ్వాలలతో విరుచుకుపడ్డాడు. సమాచార ఉపగ్రహాలు, జీపీఎస్ వ్యవస్థల్ని దెబ్బతీసే స్థాయిలో ఈ సౌరజ్వాలలు ఉన్నాయని కోల్‌కతా కేంద్రంగా పనిచేసే సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ స్పేస్ సైన్సెస్ ఇండియా-సెస్సీ వెల్లడించింది. సౌర అయస్కాంత క్రియాశీల ప్రాంతం నుంచి ఉదయం 9.27గంటలకు సౌరజ్వాలలు వెలువడ్డాయి. భారత్, ఆగ్నేయాసియా, ఆసియా పసిఫిక్ ప్రాంతంలో దీని ప్రభావం ఉంది. హైఫ్రీక్వెన్సీ కమ్యూనికేషన్ వ్యవస్థలు స్తంభించిపోవడం, ఉపగ్రహాలు, జీపీఎస్ పనితీరులో లోపాలు, కమ్యూనికేషన్ వ్యవస్థ ప్రభావితం కావడం వంటి సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని తెలిపింది. దీని ప్రభావాన్ని అంచనా వేసేందుకు తమ బృందం ప్రయత్నిస్తోందని తెలిపారు. సౌర వ్యవస్థ నుంచి ఒక్కసారిగా శక్తి వెలువడడాన్ని సౌరజ్వాలలు అంటారు. వీటి వల్ల రేడియో సిగ్నళ్లు, విద్యుత్ గ్రిడ్స్, నేవిగేషన్ సిగ్నల్స్ ప్రభావితమై.. విమానాలకు, వ్యోమగాములకు ముప్పు ఏర్పడే ప్రమాదముంది. ఇలాంటి సౌరజ్వాలలు వస్తాయని అంచనా వేసింది. భూకంపాల తరహాలో సౌరజ్వాలలనూ నాసా తీవ్రతను బట్టి వర్గీకరిస్తుంది. బుధవారం వచ్చిన ఎక్స్ తరగతి సౌరజ్వాల.. అన్నింటికన్నా తీవ్రమైనది. ఇదిలావుంటే దేశ రాజధాని న్యూఢిల్లీలో ఉష్ణోగ్రతలు తీవ్ర స్థాయిలో పెరిగిపోతున్నాయి. ఢిల్లీలో 11 ఏళ్లలో ఏప్రిల్‌లో అత్యధిక ఉష్ణోగ్రత 42.6 డిగ్రీ సెల్సియస్ వద్ద నమోదైందని ఐఎండీ పేర్కొంది. ఢిల్లీలోని సప్దర్‌జంగ్ అబ్జర్వేటరీలో మంగళవారం 42.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందని, ఇది గత 11 ఏళ్లలో ఏప్రిల్‌లో అత్యధికంగా నమోదైందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఇది 2010లో ఏప్రిల్‌లో ఒక రోజులో ఆల్-టైమ్ అత్యధిక ఉష్ణోగ్రత 46.5 డిగ్రీ సెల్సియస్ వద్ద నమోదైంది. ఢిల్లీలోని ఎనిమిది స్టేషన్లలో వేడిగాలులు వీచాయని, తీవ్రమైన వేడి పరిస్థితులు నెలకొన్నాయని ఐఎండీ తెలిపింది. ఏప్రిల్ 19 మంగళవారం నాడు గరిష్ట ఉష్ణోగ్రత 43 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా నమోదైందని, ఇది సీజన్‌లో అత్యంత వెచ్చని రోజుగా మారిందని భారత వాతావరణ శాఖ స్పష్టం చేసింది. దేశ రాజధాని ఢిల్లీలో బుధవారం తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది.

## లూధియానాలో ఘోర అగ్నిప్రమాదం

**లుథియానా, ఏప్రిల్ 20 (అక్షర వెలుగు):** పంజాబ్ రాష్ట్రంలో బుధవారం జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో ఏడుగురు సజీవదహనమయ్యారు. లూథియానా నగరంలో ఓ గుడిసెలో మంటలు చెలరేగడంతో కుటుంబంలోని ఏడుగురు సజీవదహనమయ్యారు. వారు వలస కూలీలని, ఇక్కడి టిబ్బా రోడ్డులోని మున్సిపల్ చెత్త డంప్ యార్డు సమీపంలోని తమ గుడిసెలో నిద్రిస్తున్నారని అధికారులు తెలిపారు. మునిసిపల్ చెత్త డంప్ యార్డ్ సమీపంలోని తమ గుడిసెలో నిద్రిస్తుండగా అగ్నిప్రమాదం జరిగిందని లూథియానా అసిస్టెంట్ కమిషనర్ సురీందర్ సింగ్ తెలిపారు.టిబ్బా పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ రణబీర్ సింగ్ సంఘటన స్థలానికి వచ్చారు. మృతుల్లో దంపతులతోపాటు వారి ఐదుగురు పిల్లలుగా గుర్తించారు. వారి పేర్లు ఇంకా నిర్ధారించలేదు.అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని అధికారులు చెప్పారు. తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం.. లుథియానాలోని తాజ్‌పూర్ రోడ్డులోని ఒక గుడిసెలో ఈ కుటుంబం నివసిస్తోంది. మంగళవారం రాత్రి వీరంతా నిద్రిస్తుండగా మంటలు చెలరేగాయని, ఈ ప్రమాదంలో భార్యభర్తలతోపాటు వారి నలుగురు కుమార్తెలు, ఏడాది వయసున్న కుమారుడు సజీవదహనమయ్యారు. వేరే ప్రాంతంలో నిద్రించడంతో మరో కుమారుడు రాజేశ్(17) ప్రాణాలు దక్కించుకున్నారు. సమాచారమందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే, అప్పటికే వీరంతా మరణించారని అగ్నిమాపక అధికారులు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదన్నారు.

## ఏకాభిప్రాయంతోనే కుటుంబ ఆస్తి బదలాయింపులు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 20 (అక్షర వెలుగు):** ఉమ్మడి కుటుంబ ఆస్తిని ఇతరులకు విక్రయించాలన్నా, బదిలీ చేయాలన్నా భాగస్వాములందరి సమ్మతి ఉంటేనే చెల్లుబాటు అవుతుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఏకాభిప్రాయం లేని పరిస్థితుల్లో ఆస్తిని బదిలీ చేయరాదని జస్టిస్ ఎస్.ఎ.నజీర్, జస్టిస్ కృష్ణ మురారిలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం పేర్కొంది. ఉమ్మడి కుటుంబ పెద్దగా ఉన్న తన తండ్రి...ఆయన పెంచుకున్న వ్యక్తికి బహుమతిగా 1/3వ వంతును ఆస్తిని రాసివ్వడాన్ని సవాలు చేస్తూ ఆయన కుమారుడు సుప్రీంకోర్టుని ఆశ్రయించారు. ఈ కేసు విచారణలో చట్టబద్ధమైన ఆవశ్యకత, ఎస్టేట్ ప్రయోజనం, కుటుంబ సభ్యులందరి ఆమోదం వంటి...మూడు సందర్భాల్లో మాత్రమే ఉమ్మడి ఆస్తిని కుటుంబ పెద్ద ఇతరులకు అప్పగించ గలరని ధర్మాసనం పేర్కొంది. ఈ కేసులో కర్ణాటక హైకోర్టు ఇచ్చిన తీర్పుని సుప్రీంకోర్టు సమర్థించింది. వారసత్వ ఆస్తిని కుటుంబ పెద్ద దైవ సంబంధిత కార్యక్రమాలకు మాత్రమే దానం చేయగలరని కర్ణాటక హైకోర్టు పేర్కొంది. తాను పెంచుకున్న వ్యక్తికి ఆస్తిని రాసివ్వడాన్ని దైవ కార్యంగా భావించలేమని తెలిపింది. కుటుంబ సభ్యుల ఏకాభిప్రాయం లేనందున బహుమతిగా రాసి ఇచ్చిన పత్రం చెల్లదని గతంలో కర్ణాటక హైకోర్టు తీర్పునిచ్చింది.

## ఇంటి పార్టీయే తెలంగాణకు రక్ష

(మొదటి పేజీ తరువాయి..)రూ.50 వేల కోట్లు ఇచ్చాం. రుణమాఫీ పథకానికి దాదాపు రూ.25 వేల కోట్లు కేటాయించాం. కోతలు లేకుండా సాగుకు 24 గంటలు విద్యుత్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ. త్వరలో వ్యవసాయ ఆధార, ఆహారశుద్ధి పరిశ్రమలు తీసుకువస్తామని కేటీఆర్ అన్నారు. తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలపై కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఆ రెండు పార్టీల నాయకులు పచ్చి మోసగాళ్లు.. వారిని నమ్మొద్దని ప్రజలకు సూచించారు. ఎట్టికైనా, మట్టికైనా మనోడే ఉండాలి. మన పార్టీనే ఉండాలి. ఏనాటికైనా తెలంగాణ కోసం కేసీఆర్ కడుపులో ఉండే బాధ, కాంగ్రెస్, బీజేపీ నాయకులకు ఉండదు. వారికి 29 రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. మనకు ఉన్నది ఒకే ఒక్క రాష్ట్రం తెలంగాణ. ఏనాటికైనా మన ఇంటి పార్టీనే శ్రీరామరక్ష అని కేటీఆర్ స్పష్టం చేశారు. నర్సంపేటలో ఇంటింటికీ గ్యాస్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన పీఎన్‌జీ గ్యాస్ లైన్‌ను ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డితో కలిసి మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో కేటీఆర్ ప్రసంగించారు. తెలంగాణలో 119 నియోజకవర్గాలు ఉన్నాయి. కానీ ఈరోజు పెద్దిసుదర్శన్ రెడ్డి నేతృత్వంలో నర్సంపేట నియోజకవర్గంలో కొత్త చరిత్రను సృష్టించారు. రాష్ట్రంలోని ఎక్కడా లేని విధంగా మహిళల కోసం ఇంటింటికీ గ్యాస్ అందించిన ఘనత పెద్ది సుదర్శన్ రెడ్డికే దక్కుతుందన్నారు. నర్సంపేట లో పీఎన్‌జీ గ్యాస్ లైన్ కింద 12,600 గ్యాస్ కనెక్షన్లు ఇచ్చామని కేటీఆర్ తెలిపారు. రాష్ట్రమంతటా తక్కువ ధరకే గ్యాస్ ఇచ్చేందుకు ప్రయత్నిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. వ్యవసాయ ఆధార పరిశ్రమలను నర్సంపేటలో నెలకొల్పుతామని కేటీఆర్ ప్రకటించారు. ఆహార శుద్ధి పరిశ్రమలను తీసుకొచ్చే బాధ్యత ఈ ప్రభుత్వానిది అని తెలిపారు. నర్సంపేట అభివృద్ధికి రూ. 50 కోట్లు మంజూరు చేస్తున్నామని స్పష్టం చేశారు. చెరువు, రింగ్ రోడ్డు నిర్మాణానికి ఈ నిధులు ఖర్చు చేస్తామన్నారు. ఏ ఎలక్షన్లు లేనప్పటికీ ఎప్పటికప్పుడు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందిస్తున్నామని చెప్పారు. నర్సంపేటను ఒక ఉద్యమ కేంద్రంగా మార్చి.. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. సాధించుకున్న తెలంగాణను అభివృద్ధి చేసుకుంటున్నామని మంత్రి తెలిపారు. భారతదేశంలో ఎక్కడా లేని విధంగా ఇంటింటికీ నల్లాల ద్వారా మంచినీరు అందిస్తున్నాం. కేసీఆర్ ప్రభుత్వంలో నర్సంపేటకు రెండు ఇరిగేషన్ ప్రాజెక్టులు మంజూరు చేసి నీళు ఇచ్చామన్నారు. దేవాదుల, కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా ఎస్సార్ ఎస్పీ కింద ఉన్న భూములకు నీళ్లు పారుతున్నాయని కేటీఆర్ తెలిపారు. గతంలో నర్సంపేట నియోజకవర్గంలో ఫ్యాక్షన్ రాజకీయాలు ఉండేవని కేటీఆర్ గుర్తు చేశారు. అడ్డగోలు రాజకీయాలతో అభివృద్ధిని పట్టించు కోలేదు. ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి చొరవతో ఆస్పత్రులు, డయాలసిస్ సెంటర్లు, సెంటర్ డివైడర్లు, లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నాం. మొదటి సారి ఎమ్మెల్యేగా గెలిచిన సుదర్శన్ రెడ్డి నర్సంపేట అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నారని ప్రశంసించారు. 2014లోనే సుదర్శన్ రెడ్డి గెలిచి ఉంటే.. నర్సంపేట మిగతా నియోజకవర్గాల కంటే అభివృద్ధిలో ముందు ఉండేదన్నారు. నర్సంపేట ప్రాంత అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. ఇలాంటి నాయకులను కడుపులో పెట్టుకుని చూసుకోవాలని కేటీఆర్ ప్రజలకు సూచించారు. వరంగల్, హనుమకొండ జిల్లాల్లో విస్తృతంగా పర్యటించిన కేటీఆర్.. ఇరు జిల్లాల్లో రూ. 193 కోట్ల రూపాయ లతో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేశారు. రూ. 20 కోట్ల 50 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన వరంగల్ మహానగర పాలక సంస్థ పరిపాలన భవనాన్ని కేటీఆర్ ప్రారంభించారు. రూ. 8 కోట్ల వ్యయంతో నిర్మించిన స్మార్ట్ రోడ్డు పనులు, రూ. 2 కోట్ల వ్యయంతో నూతనం గా నిర్మించిన కౌన్సిల్ హాల్, రంగంపేట లో ఆధునీకరించిన గ్రంథాలయాన్ని ప్రారంభించారు. అనంతరం రూ. 15 కోట్లతో నాలాల నిర్మాణం, పబ్లిక్ గార్డెలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మంత్రి కేటీఆర్ రాకతో పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు.స్మార్ట్ సిటీ పథకం ద్వారా రూ. 71 కోట్లతో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూం, రూ. 8 కోట్లతో మానవ వ్యర్థాల నిర్వహణ కేంద్రం, రూ. 2 కోట్లతో స్పెషల్ పార్కు, రూ. 9 కోట్లతో 37 ప్రభుత్వ పాఠశాలల్లో పనులు, రూ. 1.50 కోట్లతో వరంగల్ పోతననగర్ శ్మశాన వాటిక అభివృద్ధి, రూ. 80 లక్షలతో కేఎంజీ పార్కులో జాతీయ పతాకం, రూ. 4 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్సు పనులు, హనుమకొండలో రూ. 22 కోట్లతో వరదనీటి కాల్వలకు రిటైనింగ్ వాల్స్, రూ. 15 కోట్లతో కల్వర్టులు, రిటైనింగ్ వాల్స్‌కు శంకుస్థాపనలు చేశారు. నర్సంపేటలో రూ. 43.50 కోట్లతో పలు అభివృద్ధి పనులకు కేటీఆర్ శ్రీకారం చుట్టారు. మున్సిపల్ కార్యాలయంలో రూ. 4.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్?కు శంకుస్థాపన చేశారు. రూ. 50 లక్షలతో నిర్మించిన గ్రంథాలయ నూతన భవనం రూ. 30 లక్షల వ్యయంతో నిర్మించిన మెప్మా నూతన భవనం, చెన్నారావుపేట, దుగ్గొండి మండలాల్లో రూ. కోటి వ్యయంతో చేపట్టిన మహిళా సమాఖ్య భవనాలను కేటీఆర్ ప్రారంభించారు.కేటీఆర్ పర్యటన నేపథ్యంలో అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు.. నిబంధనలనకు విరుద్ధంగా భారీగా ఫ్లెక్సీలు, కటౌట్లు ఏర్పాటు చేశారు. దీనిపై వరంగల్ మహానగర పాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకున్నారు. పలువురు నేతలకు అధికారులు జరిమానా విధించారు. ఎలాంటి అనుమతి లేకుండా మంత్రి కేటీఆర్, మంత్రులు, ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్ భాస్కర్‌తో కూడిన కటౌట్లను ఏర్పాటు చేశారు. ఈ మేరకు జీడబ్ల్యూఎంసీ అధికారులు.. మేయర్ గుండు సుధారాణికి రూ.2 లక్షలు, తెరాస నేత కేశవరావుకు రూ.50 వేల జరిమానా విధించారు. అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయొద్దని వరంగల్ బల్దియా అధికారులు ముందుగానే సూచించినా.. అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు బేఖాతరు చేశారు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## గర్భిణిని మంచంపై ఆస్పత్రికి మోసుకెళ్లిన జవాన్

(మొదటి పేజీ తరువాయి..) చేశారు. ముందు రోడ్డు దగ్గరకు తీసుకెళ్లి అక్కడ నుంచి ఏదైనా బండిలో ఆస్పత్రికి తీసుకెళ్లాలనుకున్నారు. దానికోసం ఆమెను మంచంపై ఆరు కిలోమీటర్లు మోసుకెళ్లారు. తల్లీబిడ్డలను రక్షించారు. ఇలాంటివి ఎన్ని జరిగినా, స్థానిక ప్రజల బాధలు బయటకొస్తున్నా వారి పరిస్థితిలో మాత్రం మార్పు రావడం లేదు. కనీసం నడిచే దారి కూడా లేక.. ఇంకా బాధలు పడుతూనే ఉన్నారు. వారి మొర, అవస్థలు ఎవరికి పట్టడం లేదనే విమర్శలు ఉన్నాయి.

## ఆరుతడి పంటలతో లాభాలు ఆర్జించండి

(మొదటి పేజీ తరువాయి..) పండించడంతో పాటు అంతర పంటలు వేసి లక్షన్నర రూపాయల నుంచి రెండు లక్షలన్నర రూపాయల వరకు రైతులు ఆర్జిస్తున్నట్లు మంత్రి తెలిపారు. గ్రామానికి చెందిన నర్సింలు స్ఫూర్తితో ఎక్కువ మంది రైతులు కూడా సెరి కల్చర్, ఆయిల్ ఫామ్, కమర్షియల్ పంటలు పండించాలని కోరారు. అనంతరం పెద్దకోడూర్ గ్రామంలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయ వార్షికోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత, డా.బీఆర్ అంబేద్కర్ విగ్రహాలను నెలకొల్పుతామని మంత్రి హరీశ్‌రావు అన్నారు. అంతకుముందు నియోజకవర్గంలోని చిన్నగుండవెల్లి గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. దేశ అభివృద్ధి కోసం అంబేద్కర్ ఆలోచనలను అమలు చేద్దామన్నారు. మూఢ నమ్మకాలను రూపుమాపి, విద్య పై అవగాహన కల్పిస్తూ ప్రజల్ని చైతన్యం చేయాలన్నారు. విద్య ఆవశ్యకతను క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలియజేయాలని మంత్రి పిలుపునిచ్చారు. అణగారిన వర్గాల పేదరికాన్ని రూపు మాపి, ఆర్థికాభివృద్ధి సాధనకై సీఎం కేసీఆర్ దళితబంధు తెచ్చారని మంత్రి గుర్తు చేశారు. విద్య, ఉద్యోగాల్లో, కాంట్రాక్టులలో కూడా రిజర్వేషన్లు తీసుకొచ్చామన్నారు. త్వరలోనే దేశంలోని అన్ని రాష్ట్రాలలో కూడా దళితబంధు అమలు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడతాయని స్పష్టం చేశారు. 13 వేల టీచర్ పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామన్నారు. మంత్రి వెంట సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి, ఎంపీపీ శ్రీదేవి, జెడ్పీటీసీ శ్రీహరి గౌడ్, గ్రామ సర్పంచ్, ఇతర ప్రజాప్రతినిధులు తదితరులు హాజరయ్యారు.

# వ్యవసాయరంగ బలోపేతానికై ప్రభుత్వ కృషి



**సిద్దిపేట్ 20 ఏప్రిల్ (అక్షర వెలుగు)**: వ్యవసాయ రంగం బలోపేతానికి రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూర్ మండలం చందలాపూర్ గ్రామంలో 143 మంది రైతులకు జెడ్పీ చైర్మన్ రోజా శర్మతో కలసి తుంపర సేద్య పరికరాలను, ప్రోసీడింగ్ కాపీలను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశంలోని గుజరాత్, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కరెంటు కోతలు ఉన్నాయని, కానీ మన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ నేతృత్వంలో ఒక్క యూనిట్ కు రూ.20 రూపాయలు ఖర్చు పెట్టి రైతులకు ఉచితంగా కరెంటు అందిస్తున్నట్లు చెప్పారు. రైతులు ఆరుతడి, కమర్షియల్ పంటలు పండించి లాభాలు పొందాలని కోరారు. ఇప్పటికే నియోజకవర్గ పరిధిలోని రైతులకు 4 వేల తుంపర సేద్య పరికరాలు పంపిణీ చేసినట్లు, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతు శ్రేయస్సును కోరిన రైతు ప్రభుత్వానికి సెరి కల్చర్, ఆయిల్ ఫామ్, కమర్షియల్ పంటలు పెడితేనే సీఎం కేసీఆర్ ప్రభుత్వానికి సంతోషమని చెప్పుకొచ్చారు. ఆయిల్ ఫామ్ పంటలు పండించడంతో పాటు అంతర పంటలు వేసి లక్షన్నర రూపాయల నుంచి 2 లక్షలన్నర రూపాయల వరకూ రైతులు ఆర్జిస్తున్నట్లు, గ్రామానికి చెందిన నర్సింలు దేశానికే ఫేమస్ ఆదర్శంగా నిలిచినట్లు, వారి స్ఫూర్తితో ఎక్కువ మంది రైతులు కూడా సెరి కల్చర్, ఆయిల్ ఫామ్, కమర్షియల్ పంటలు పండించాలని కోరారు. అనంతరం పెద్దకోడూర్ గ్రామంలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయ వార్షికోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు.

# నిరుపేదల సంక్షేమమే టీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయం

పినపాక ఎమ్మెల్యే రేగా



**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 20 (అక్షర వెలుగు)**: బుధవారం మణుగూరు మండలంచలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మణుగూరు ప్రాంతానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు లక్షా 40వేల రూపాయల విలువగల సీఎం సహాయ నిధి పథకం లబ్ధిదారులకు ప్రభుత్వం ద్వారా మంజూరైన చెక్కులను అందజేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, పినపాక శాసనసభ్యులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు ఈ సందర్భంగా శాసనసభ్యులు రేగా కాంతారావు మాట్లాడుతూ సీఎం సహాయనిధి కింద అందించే సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆపద సమయాల్లో వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి ఆపద్బంధులా ఆదుకుంటుందని అన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల సంక్షేమం విషయంలో పూర్తి భరోసా కల్పిస్తుందన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలను కాపాడేందుకు తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి కింద చికిత్సకు తగిన ఆర్థిక సహాయం బాధితులకు అందిస్తుందన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఎందరో నిరుపేదలు ప్రాణాలు నిలబడుతున్నాయనని అని అన్నారు. రాష్ట్రంలో వైద్య విద్యా కు, సీఎం కేసీఆర్ గారు పెద్దపీట వేస్తున్నారని అన్నారు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు భయపడవద్దని ప్రభుత్వం తరపున సహాయం అందిస్తామని వారు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల టిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో మరణించిన కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి



**మహమ్మదాబాద్, ఏప్రిల్ 20 (అక్షర వెలుగు)**: మండల పరిధిలోని కంచన్ పల్లి గ్రామంలో ఇటీవలే రోడ్డు ప్రమాదం లో ఒకరు, మరొక మహిళ పిచ్చమ్మ మరణించడం తో వారి ఇద్దరి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం నింపి రెండు కుటుంబాలకు చెరొక రూ. 5 వేల అందించిన పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి. అనంతరం బీరప్ప దేవాలయం ను దర్శించుకుని, దేవాలయ అభివృద్ధికి రూ 25 వేలు అందించిన పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి. ఈ కార్యక్రమంలో గండీడ్ మండల ప్రజాప్రతినిధులు, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


# ఉచిత వైద్య శిబిరానికి బయలుదేరిన గ్రామస్థులు



**పరిగి, ఏప్రిల్ 20 (అక్షర వెలుగు)**: పుడుర్ మండలంలోని చీలపుర్ గ్రామంలో నుండి టిఆర్ఆర్ జనరల్ హాస్పిటల్, పఠాన్ చెరుకు ఉచిత వైద్య శిబిరానికి బయలుదేరిన గ్రామస్థులు, టి.రామోహన్ రెడ్డి మాజీ శాసనసభ్యులు ఉచితముగా నిర్వహిస్తున్నటువంటి వైద్యశిబిరానికి గ్రామ సర్పంచ్ రాములు ఉపసర్పంచ్ రామకృష్ణ రెడ్డి గ్రామ అధ్యక్షుడు రామస్వామి ఆధ్వర్యంలో గ్రామస్థులను ఉచిత వైద్య శిబిరానికి పంపించడం జరిగింది. ఈ కార్యక్రమం లో మండల అధ్యక్షుడు సురేందర్ ముధిరాజ్ నాయకులు వసంత్ రెడ్డి రమేష్ కృష్ణయ్య రాములు రవీందర్ వెంకటయ్య బుచ్చన్న సలావుదిన్ తదితరులు పాల్గొన్నారు.

# దళితబంధు పథకం దేశానికే ఆదర్శం

పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి




**గండీడ్, ఏప్రిల్ 20 (అక్షర వెలుగు)**: మండల కేంద్రంలో రైతు వేదిక ఆవరణలో లో దళిత బంధు పథకం లో భాగంగా పరిగి నియోజకవర్గంలోని గండీడ్ మండల పరిధిలోని వెన్నచెడ్, నంచర్ల, గండీడ్ గ్రామాలకు చెందిన లబ్ధి దారులకు ఐదు ట్రాక్టర్ లు, నాలుగు కార్ల ను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి అందించిన పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..దళిత బంధు ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందుతామన్న నమ్మకం, ధైర్యం దళితుల్లో కనబడిందని పేర్కొన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలు ఈర్షపడే విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దళితుల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. అనంతరం స్వయంగా ట్రాక్టర్ డ్రైవింగ్ చేసిన ఎమ్మెల్యే ఈ కార్యక్రమంలో గండీడ్ మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, దళిత బంధు లబ్ధి దారులు, తదితరులు పాల్గొన్నారు.

# బీఎస్పీలో భారీగా చేరికలు

కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన రాష్ట్ర కార్యదర్శి దొడ్డ సమ్మయ్య



**కరీంనగర్, ఏప్రిల్ 20 (అక్షర వెలుగు)**: కరీంనగర్ అసెంబ్లీ అధ్యక్షులు నల్లాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన యువకులు బహుజన సమాజ్ పార్టీలో చేరినారు ఈ చేరికల సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి దొడ్డ సమ్మయ్య జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ నిషాని రామచంద్రం ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా దొడ్డ సమ్మయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యకు పరిష్కారం చూపడంలో కేసీఆర్ విఫలమైనందున పెద్ద ఎత్తున యువకులు బీఎస్పీ లో చేరుతున్నట్లు ప్రకటించారు ఆర్ ఎస్ పి నాయకత్వం లో తెలంగాణలో నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామని అన్నారు జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ నిషాని రామచంద్ర మాట్లాడుతూ తెలంగాణలో దళిత బంధు పథకం కేవలం ప్రజా ప్రతి నిధుల బినామీల కే అందుతున్నాయని అన్నారు నిజమైన నిరుపేదలకు అందడం లేదన్నారు స్థానిక మంత్రి గారికి దళితుల పట్ల చిత్తశుద్ధి ఉంటే అర్హులకు యూనిట్లు అందించాలన్నారు బిజెపి ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చ పోతుంది అన్నారు రాజ్యాంగం రద్దయితే బహుజన కులాలు బానిసలవుతున్నారు రాజ్యాంగ రక్షణ కోసం బహుజన యువకులు బీఎస్పీ లో చేరాలని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లాల రాజేందర్ జిల్లా కార్యదర్శి మంద రవీందర్ జిల్లా కోశాధికారి ఉల్లం దుల మహేష్ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పోతుర్ల రాజు అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి బడుగు నరేష్ మానకొండూరు అసెంబ్లీ అధ్యక్షులు సంగ పట్ల మల్లేశం సీనియర్ నాయకులు మంద బాలయ్య మరో సీనియర్ నాయకులు చిలుముల శంకర్ కత్తుల హేమంత్ ఆస్తా పురం మధు చేరిన వారి పేర్లు అస్త పురం మధు మిట్టపల్లి రామ్ ప్రసాద్ కోడూరి కనకరాజు లంక ప్రవీణ్ పో త్తూరి సాయి ఇంకా తదితరులు పాల్గొన్నారు.

# జలాశయం నీటి మట్టం 540 అడుగులు

**నాగార్జునసాగర్, ఏప్రిల్ 20 (అక్షర వెలుగు)**: నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం బుధవారం నాటికి 540 అడుగులు. టీఎంసీలలో188.3260 సమానము. నాగార్జునసాగర్ జలాశయం పూర్తి నీటి మట్టం 590 అడుగులు, నాగార్జున సాగర్ జలాశయం కుడి కాలువకు నీటి విడుదల లేదు, ఎడమ కాలువ ద్వారా3,758 క్యూసెక్కుల లో నీరు విడుదల అవుతుంది. ప్రధాన విద్యుత్ కేంద్రం ద్వారా2200 క్యూసెక్కులు నీరు విడుదలవుతుంది. నాగార్జునసాగర్ జలాశయం కు ఎగువ నుండి1980 క్యూసెక్కుల నీరు వస్తుండగా, సాగర్ జలాశయం నుండి పూర్తి నీటి విడుదల9,237 క్యూసెక్కుల నీరు అవుతుంది.

# ములుగు ఎమ్మెల్యే సీతక్కపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తెరాస నాయకుడు పోరిక గోవింద్ నాయక్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలి

డిమాండ్ చేసిన కాంగ్రెస్ పార్టీ గోవిందరావుపేట మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రసపుత్ సీతారాంనాయక్



**ములుగు, ఏప్రిల్ 20 (అక్షర వెలుగు)**: బుధవారం రోజున గోవిందరావుపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయగా అట్టి సమావేశానికి ముఖ్య అతిథిగా మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రసపుత్ సీతారాంనాయక్ గారు విచ్చేసి తండాలు గూడాలు మరియు గ్రామాల్లో అనునిత్యం ప్రజల కోసం పని చేస్తూ కష్ట కాలంలో అండగా నిలబడుతున్న ములుగు ఎమ్మెల్యే సీతక్క గారిపై కావాలని అనుచిత వ్యాఖ్యలు చేసిన తెరాస నాయకుడు పోరిక గోవింద్ నాయక్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు ఈ సందర్భంగా సీతారాంనాయక్ మాట్లాడుతూ కరోన కష్ట కాలంలో మనిషికి మనిషే దూరంగా ఉంటున్న సమయంలో కరోనను సైతం లెక్క చేయకుండా గెలిపించిన ప్రజల కోసం అనునిత్యం పాటు పడి అండగా నిలబడి తండాలు గూడాలు గ్రామాలు అని తేడా లేకుండా ప్రతి ఒక్కరికి తనకు తోచిన సహాయం చేసి ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్న సీతక్క గారిని విమర్శించే స్థాయి గాని అర్హత గాని పోరిక గోవింద్ నాయక్ లేదని అన్నారు గతంలో ఎంపీటీసీ ఎవరి వల్ల అయినారో గుర్తెరిగి మాట్లాడాలని తెరాస పార్టీ అధికారంలోకి వచ్చి ఎనిమిది ఏండ్లు గడిచిన ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉన్నది అని స్వయానా మీ ముఖ్యమంత్రి గారు ప్రకటించిన ఎస్టీలకు 12% రిజర్వేషన్ ఏమైంది పోడు భూములకు పట్టా బుక్కులు ఇప్పిస్తానని ఇచ్చిన హామీ ఏమైంది డబల్ బెడ్ రూమ్ ఇండ్లు తండాలలో ఎంతమందికి ఇచ్చారు తండాలలో ప్రజలకు వరదల వలన పంట నష్టం కలిగితే ఎంత మందికి పంట నష్ట పరిహారం కల్పించారో తెలియజేయాలి అని మీరు అధికార పార్టీలో ఉండి ములుగు నియోజకవర్గానికి చేసిన పనులు ఏంటో చెప్పాలి అని అన్నారు ఆ రోజున కాంగ్రెస్ పార్టీ బంజారాలను ఎస్టీ జాబితాలో చేర్చడం వలనే తండాల అభివృద్ధి జరిగాయని ఈ రోజు బంజారాలు ఒక సర్పంచ్ ఎంపీటీసీ ఎంపీపీ ఉద్యోగాలు ఏ పదవులు వచ్చిన అది కాంగ్రెస్ భిక్ష అని అన్నారు ఈ రోజు తండాల్లో ఉన్న ఇండ్లు అన్ని కూడా ఇందిరమ్మ ఇండ్లు మాత్రమే అని వారికి అటవీ హక్కుల చట్టం ద్వారా పోడు భూములకు హక్కు పత్రాలు ఇచ్చింది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే అని అన్నారు ఎస్టీ జాబితాలో ఎమ్మెల్యేలు మంత్రి పదవులు అనుభవిస్తున్నారంటే అది కేవలం కాంగ్రెస్ పార్టీ వల్లే అని అన్నారు ఎస్టీ జాబితాలో గెలిచిన ఎమ్మెల్యేలు మంత్రులు కరోన కాలంలో ఎక్కడ నక్కారని అన్నారు ఇప్పటికి అయిన ప్రజల కోసం పని చేసే నాయకులు ఎవరు పదవుల కోసం పని చేసే నాయకులు ఎవరు అని ప్రజలకు తెలుసు అని అన్నారు సీతక్క గారిని విమర్శించే నైతిక విలువలు మీకు కానీ మీ పార్టీకి కానీ లేవు అని వెంటనే తెరాస నాయకుడు పోరిక గోవింద్ నాయక్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కణతల నాగేందర్ రావు సీనియర్ నాయకులు పాలడుగు వెంకటకృష్ణ ఎంపీటీసీ గోపిదాసు ఏడుకొండలు గ్రామ అధ్యక్షులు రామచంద్రపు వెంకటేశ్వర్ రావు కొత్తపెల్లి నరేష్ పల్లపు రామారావు వెంకటేశ్వర్లు తదితర నాయకులు పాల్గొన్నారు.

# బిందెలతో నీళ్ల కోసం ధర్నా



**ములుగు, ఏప్రిల్ 20 (అక్షర వెలుగు)**: గోవిందరావుపేట మండల కేంద్రంలోని చల్వాయి గ్రామపంచాయతీ ముందు 12వ వార్డు ప్రజలు మాకు నీళ్ల సమస్య ఉంది అని చెప్పి మిషన్ భగీరథ నీళ్లు సరిపోవట్లేదు అని మా వార్డుకు ఒక బోరు గ్రామపంచాయతీ తరఫునుంచి వేయించాలి అని చెప్పివాళ్ళు అడగడం జరిగింది సర్పంచ్ ఈసం సమ్మయ్య గారు నేను ఏమి చేయలేను ప్రభుత్వం ఇస్తున్న మిషన్ భగీరథ నీళ్లు తప్ప బోర్లు వేసే అధికారం మాకు లేదు అని చెప్పిచెప్పగా వెంటనే ఉప సర్పంచ్ తెల్ల హరిప్రసాద్ గారు సంబంధిత అధికారులకు చరవాణి ద్వారా సమాచారం ఇచ్చి 12వ వార్డు ప్రజలకు బోర్ వేయించే విధంగా అధికారుల దగ్గర హామీ ఇప్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు చాపల ఉమాదేవి గుండెబోయిన నాగమణి వార్డు సభ్యులు మరియు తదితరులు పాల్గొనడం జరిగింది.

# టిఆర్ఎస్ పార్టీ నాయకుల అరాచకాలు!

సిబిఐ విచారణ జరిపించాలని బిజెపి ఆధ్వర్యంలో శవయాత్ర

డిమాండ్ చేస్తున్న బిజెపి గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి తాటి కృష్ణ



**ములుగు, ఏప్రిల్ 20 (అక్షర వెలుగు)**: జిల్లా కేంద్రంలో బుధవారం రోజున భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ గారి ఆదేశాల మేరకు ములుగు జిల్లా కేంద్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వం యొక్క నాయకుల అరాచకాల పైన సిబిఐతో విచారణ చేయించాలని డిమాండ్ చేస్తూ జాతీయ రహదారిపై బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి నగరపు రమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి తాటి కృష్ణ గారు హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ శవ యాత్ర ని నిర్వహించి అనంతరం దహనం చేయడం జరిగింది అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత టిఆర్ఎస్ నాయకులు ఆగడాలకు అడ్డూ లేదని రాష్ట్రంలో ఏదో ఒక చోట నిత్యం సామాన్య ప్రజలు టిఆర్ఎస్ నాయకుల చేతిలో మానసిక ఇబ్బందులకు లోనై, న్యాయం జరిపించాలిసినటువంటి పోలీస్ వ్యవస్థ రాజకీయ ఒత్తిళ్లకు లోనై చేతులెత్తేయడంతో బాధితులు చేసేది ఏమి లేక బలత్మారనాలకి పాల్పడుతున్నారని అన్నారు ఖమ్మం జిల్లాలో మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అనుచర గుండాలతో బిజెపి కార్యకర్త అయినటువంటి సాయి గణేష్ పై కక్షసాధింపు చర్యల్లో భాగంగా పోలీస్ వ్యవస్థ ని చేతిలో తీసుకొని అక్రమ కేసులతో మానసిక ఇబ్బందులకి గురి చేయడం వలన గతవారం ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించడం జరిగింది అతని యొక్క మరణవాంగ్మూలం లో మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అతని అనుచరులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చెప్పినప్పటికీ పోలీస్ శాఖ లేనిపక్షంలో రాబోయే రోజులలో మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు అడప బిక్షపతి కొండూరు నరేష్ జిల్లా కార్యదర్శి శిలమంతుల రవీంద్ర చారి సాంబశివ రెడ్డి శివగాని స్వప్న జిల్లా అధికార ప్రతినిధి దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి కార్యాలయ కార్యదర్శి చల్లూరి మహేందర్ ప్రచార కార్యదర్శి దొంతి రెడ్డి రవి రెడ్డి జిల్లా సీనియర్ నాయకులు తక్కెళ్లపల్లి దేవేందర్ రావు సిరికొండ బలరాం కారుపోతుల యాదగిరి గౌడ్ యువ మోర్చా అధ్యక్షులు కొత్త సురేందర్ కిసాన్ మోర్చ అధ్యక్షులు జినుకల కృష్ణాకర్ రావు మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు మహమ్మద్ యాకూబ్ పాషా బిజెపి మండల అధ్యక్షులు ఉమ్మడి రాకేష్ యాదవ్ భూక్యా జవహర్ లాల్ మద్దినేని తేజరాజ్ మల్లెల రాంబాబు గండేపల్లి సత్యం యువమోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దొంతి రెడ్డి రాకేష్ రెడ్డి జంగా హనుమంత్ రెడ్డి మహ్మద్ మీరా మండల పదాధికారులు కొత్తకొండ రాములు కిషన్ రావు కోయిల కవిరాజ్ మేడిశెట్టి పురుషోత్తం కొమరం శంకర్ మాల్కం శోభన్ జీడీ ప్రశాంత్ కనుకుల అవినాష్ బొల్లంకొండ వినోద్ తక్కేలపల్లి సుమన్ రావు గుండెపు సంతోష్ సునీల్ నాగరాజు శ్రీధర్ గూడపల్లి ప్రవీణ్ మహేష్ పవన్ సాయి తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మహత్యల ఘటనలపై జోక్యం చేసుకోండి



- సిబిఐ విచారణలకు ఆదేశించేలా చేయండి
- మంత్రి పువ్వాడను బర్తరఫ్ చేయించండి
- గవర్నర్ తమిళసైని కలసి కోరిన బిజెపి నేతలు

**హైదరాబాద్, ఏప్రిల్ 20 (అక్షర వెలుగు)**: ఖమ్మం, రామాయంపేట్ ఘటనలపై జోక్యం చేసుకోవాలని బీజేపీ నేతల బృందం గవర్నర్ తమిళి సైను కోరింది. ఆత్మహత్యలపై సీబీఐ విచారణ జరపాలని బీజేపీ డిమాండ్ చేసింది. అవి ఆత్మహత్యలు కావని... టీఆర్ఎస్ ప్రభుత్వ హత్యలని బీజేపీ నేతలు ఆరోపించారు. మంత్రులు, పోలీసుల ముద్దాయిలుగా ఉన్న నేపథ్యంలో బాధితులకు అన్యాయం జరుగుతోందన్నారు. ఎమ్మెల్యే వనమా కొడకు, నిర్మల్ ఘర్షణలపై విచారణ జరపాలని కోరారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకూ పోరాడుతామని తెలిపారు. ఆత్మహత్య, కామారెడ్డిలో సంతోష్, పద్మల అందుకే కేంద్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని కోరినట్టు వెల్లడించారు. ఖమ్మం సాయి గణెళిష్, కామారెడ్డిలో సంతోష్, పద్మ ఆత్మహత్యలపైన సీబీఐతో విచారణ జరిపించాలని కోరినట్టు తెలిపారు.ఇక, రాజకీయ ప్రత్యర్థులను వేధించి ఆత్మహత్యలు చేసుకునేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు.. అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ.. బీజేపీ కార్యకర్తలను అణిచి వేస్తున్నారని మండిపడ్డ ఆయన.. బీజేపీపై టీఆర్ఎస్ దాడులు చేస్తున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారని విమర్శించారు. మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పై వచ్చిన ఆరోపణలకు నైతిక బాధ్యత వహిస్తూ ఆయన రాజీనామా చేయాలని.. రాజీనామా చేయకపోతే ప్రభుత్వం భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు పోలీసులు టీఆర్ఎస్ కార్యకర్తల్లా పని చేస్తున్నారని ఆరోపించారు బీజేపీ నేత పొంగులేటి సుధాకర్ రెడ్డి.. ఎఫ్ఐఆర్ ఇవ్వకుండా కేసీఆర్ మార్క్ పాలన జరుగుతుందన్న ఆయన.. పువ్వాడ అజయ్ కుమార్ మంత్రి పదవికి రాజీనామా చేయాలి? లేకుంటే ఆయన్ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.. ఖమ్మం, రామాయంపేట ఘటనలపై గవర్నర్ జోక్యం చేసుకోవాలని కోరామని.. కేసీఆర్ రాజ్యాంగం పేరుతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని మండిపడ్డారు.. ఇక, ఆత్మ హత్యలు తన దృష్టిలో ఉన్నాయని తెలిపిన గవర్నర్.. బాధ కరమైన సంఘటనలు అని ఆవేదన వ్యక్తం చేసినట్టు బీజేపీ నేతలు తెలిపారు.

# డాక్టర్ కావాలన్న యువతికి గుత్తా చేయూత

## 50వేలు ఆర్థిక సాయం అందచేత



**నల్లగొండ, ఏప్రిల్ 20 (అక్షర వెలుగు):** తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. తన స్వగ్రామం ఉరుమడ్ల గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థిని కత్తుల అలివేలు డాక్టర్ కావాలనే దృఢ సంకల్పంతో చదివి ఎంబీబీఎస్ సీట్ సాధించించి. రంగారెడ్డి జిల్లా మొహినాబాద్‌లోని భాస్కర మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీట్ లభించింది. అయితే ఆ కళాశాలలో చేరడానికి ట్యూషన్ ఫీజు చెల్లించే ఆర్థిక స్థోమత లేకపోవడంతో గుత్తా సుఖేందర్ రెడ్డి తనయుడు గుత్తా అమిత్ రెడ్డిని కలిసి తన పరిస్థితిని వివరించారు. వెంటనే ఆయన తన తండ్రి గుత్తా సుఖేందర్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే ఆ అమ్మాయి చదువుకు అవసరమైన 50,000 రూపాయల సహాయాన్ని గుత్తా సుఖేందర్ రెడ్డి తన తండ్రి కీర్తిశేషులు గుత్తా వెంకట్ రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ తరపున అందించారు. డాక్టర్ కావాలనే తన లక్ష్యానికి ఆర్థిక సహాయాన్ని అందించిన గుత్తా సుఖేందర్ రెడ్డి, గుత్తా అమిత్ రెడ్డికి కత్తుల అలివేలు కృతజ్ఞతలు తెలియజేశారు.

# రాష్ట్రంలో మూడురోజులు తేలికపాటి వర్షాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 20 (అక్షర వెలుగు):** రాష్ట్రంలో మూడు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉపరితల ద్రోణి ప్రభావంతో రానున్న మూడ్రోజులు రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయని చెప్పింది. రాయలసీమ నుంచి తమిళనాడు వరకూ 900 మీటర్ల ఎత్తులో ఉపరితల ద్రోణి ఏర్పడిందని పేర్కొన్నది. దీని ప్రభావంతో పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో వర్షాలు కురుస్తాయని, అక్కడక్కడ ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని చెప్పింది.

# ఖమ్మంలో నీ అడ్రస్ గల్లంతవుతది కొడుకా..

## - మంత్రి పువ్వాడపై ఈటల ఫైర్



**ఖమ్మం, ఏప్రిల్ 20 (అక్షర వెలుగు):** క్యాబినెట్ మాజీ సహచరుడు ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌పై బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అధికార దర్పంతో ప్రవర్తించిన ఎందరో కాలగర్భంలో కలిసిపోయారని ఆయన వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లా బీజేపీ కార్యకర్త సాయి గణేష్ ఆత్మహత్య వ్యవహారం తీవ్ర కలకలం రేపుతోంది. టీఆర్ఎస్ నేతలు అక్రమ కేసులు పెట్టించి హింసించడంతోనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడని బీజేపీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈరోజు బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన మాజీ క్యాబినెట్ సహచరుడు, జిల్లా మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌పై నిప్పులు చెరిగారు. అధికార దర్పంతో దారుణాలకు పాల్పడుతున్నారని.. బీజేపీ కార్యకర్తలను హింసిస్తున్నారని ఈటల ధ్వజమెత్తారు. అధికారం శాశ్వతం కాదని.. 2023లో ఖమ్మంలో నీ అడ్రస్ గల్లంతవుతది కొడుకా.. మీ తాత జాగీరా ఇది? అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎంతో మంది కాలగర్భంతో కలిసిపోయారని.. చరిత్ర హీనులుగా మిగిలిపోతారని ఆయన పువ్వాడను హెచ్చరించారు. తన మరణానికి మంత్రి పువ్వాడ అజయ్, పోలీసులే కారణమని మరణ వాంగ్మూలం ఇచ్చినా కనీసం కేసులు నమోదు చేయకపోవడం దారుణమని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో జరుగుతున్న అన్ని ఆత్మహత్యలపై సీబీఐ దర్యాప్తు చేయించాలని కేంద్రానికి ఈటల విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య ప్రభుత్వం ఉన్నట్టు సీఎం భావించడం లేదని.. వారసత్వం, నిజాం సర్కార్‌కి వారసుడిగా భావిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తన ప్రత్యర్థి పార్టీలను వేధించడం.. అక్రమ కేసులు బనాయించడం.. ఆర్థికంగా దెబ్బతీసి దారికి తెచ్చుకోవడమే నైజంగా మారిందని మండిపడ్డారు. బీజేపీ కార్యకర్తల మీద దాడులు చేయండి.. వారిని ఊళ్లలో తిరగకుండా చేయమని ఆదేశాలిచ్చారని.. ముఖ్యమంత్రి స్వయంగా ఆదేశాలిస్తే పోలీసులు ఎలా ప్రవర్తిస్తారో అర్థం చేసుకోవచ్చని అన్నారు. శిశు పాలుడు తప్పు చేసినట్టు కేసీఆర్ తప్పులు చేస్తున్నారు. 101 తప్పులు అయ్యాయి. ఆయన్ను ప్రజాక్షేత్రంలో దోషిగా నిలబెట్టాము. ఈ ప్రభుత్వానికి పతనం తప్పదని ఈటల అన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు.

# శాంతిభద్రతల పరిరక్షణతో పాటు క్రీడల్లో ప్రతిభ కనబర్చాలి

## ఐ.పి.యెస్ రోహిణి ప్రియదర్శిని



**మెదక్, మెదక్, ఏప్రిల్ 20 (అక్షర వెలుగు):** బుధ వారం అవుసులపల్లి వద్ద ఉన్న నూతన పోలీసు గ్రౌండ్ లో మెదక్ జిల్లా వార్షిక క్రీడా పోటీలను జిల్లా యెస్.పి రోహిణి ప్రియదర్శిని ఐ.పి.యెస్ పోలీసు క్రీడా జెండా ఎగురవేసి బెలూన్లను గాల్లోకి వదిలి ప్రారంబించారు. ఈ సందర్భంగా జిల్లా యెస్.పి శ్రీమతి రోహిణి ప్రియదర్శిని ఐ.పి.యెస్ మాట్లాడుతూ...ఖాకీ బట్టలతో నిత్యం పని ఒత్తిడిలో పరుగులు తీసే పోలీసులు ఆ పనులు పక్కన పెట్టి ఆటలు ఆడేందుకు మైదానంలో దిగారని. ఏఎస్పీ, డీఎస్పీ, సీఐ, ఎస్ఐ, ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్, హోంగార్డు... ఇలా హోదాలను పక్కన పెట్టి తమ జట్టును గెలిపించుకునేందుకు కలిసికట్టుగా పోరాడాలని. పోలీసు సిబ్బంది శాంతిభద్రతల పరిరక్షణతో పాటు క్రీడల్లో ప్రతిభ కనబర్చాలని పోలీసు అధికారులకు, సిబ్బందికి సూచించారు. నిత్యం పనిఒత్తిడితో విధులకు హాజరయ్యే పోలీసులకు మానసిక ప్రశాంతత కోసం స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం పరితపిస్తున్న పోలీసులకు ఆటల పోటీలు నూతన ఉత్సాహాన్ని ఇస్తాయన్నారు. వార్షిక క్రీడలు పోలీసులకు ఉపశమనాన్ని కలిగిస్తాయన్నారు. గెలుపు, ఓటములు సమానంగా స్వీకరించి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాష్ట్రం ఏర్పాడ్డాక మొదటి సారిగా జిల్లా వార్షిక పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ఈ సంవత్సరానికి సంబంధించి బుదవారం జిల్లా పోలీస్ మైదానంలో కోలాహలంగా మొదలైనాయని గెలుపోటములు ముఖ్యంకాదని, క్రీడా స్ఫూర్తితో ఆడాలని, సహృద్భావ వాతావరణంలో ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యం, ఉల్లాసం, ఉత్సాహానికి క్రీడలు దోహదపడతాయన్నారు. సమాజంలో పోలీసు పాత్ర అనేది అత్యంత కీలకమని, పోలీసు ఉద్యోగం అనేది వత్తిడి, శ్రమతో కూడినదని, వత్తిడిని అధిగమించి ముందుకు వెళ్ళడానికి ఇలాంటి క్రీడా కార్యక్రమాలు బాగా దోహదం చేస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాగా ఆడాలని, క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని, గెలుపు ఓటములు సహజమని, ప్రతి ఒక్కరూ గెలుపుకోసం ఆడాలని, క్రీడా స్ఫూర్తి కలిగి ఉండాలని, జిల్లా పేరును నిలపడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలంటూ క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ క్రీడా పోటీల్లో 8 జట్టు పాల్గొంటాయని అవి ఏ.ఆర్ జట్టు ,మెదక్ రూరల్ సర్కిల్ జట్టు, మెదక్ పట్టణ జట్టు, జిల్లా పోలీసు ప్రదాన కార్యాలయ జట్టు, నర్సాపూర్ సర్కిల్ జట్టు, తూప్రాన్ సర్కిల్ జట్టు, రామాయంపేట సర్కిల్ జట్టు, అల్లాదుర్గ్ సర్కిల్ జట్టు పాల్గొంటాయని అన్నారు. ఈ వార్షిక క్రీడా పోటీల్లో బాడ్మింటన్, వాలీబాల్, క్రికెట్, టెన్నికాయిట్, తగ్గఫ్ వార్ ఉన్నాయని అన్నారు. వాలీబాల్ మొదటి విజేతలు ఏ.ఆర్ జట్టు, మెదక్ పట్టణ జట్టు, రామాయంపేట సర్కిల్ జట్టు. టెన్నికాయిట్ విజేతలు లక్ష్మి సివిల్ కానిస్టేబుల్ తూప్రాన్ పోలీసు స్టేషన్. పూజ ఏ.ఆర్ మహిళా కానిస్టేబుల్. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు యెస్.పి డా.బి.బాలస్వామి ఐ.పి.యెస్, మెదక్ డి.యెస్.పి.సైదులు, తూప్రాన్ డి.యెస్.పి .కిరణ్ కుమార్ ఏ.ఆర్ డి.యెర్స్. పి. శ్రీనివాస్ గారు, ఆర్.ఐ. లు సూరపు నాయుడు నాగేశ్వర్ రావ్, రామాయంపేట సర్కిల్ సి.ఐ చంద్రశేఖర్ రెడ్డి,మెదక్ పట్టణ సి.ఐ.శ్రీ.మధు గారు, మెదక్ రూరల్ సి.ఐ.శ్రీ విజయ్ కుమార్ గారు, అల్లాదుర్గ్ సి.ఐ. జార్జ్, నర్సాపూర్ సి.ఐ. షేక్ లాల్ మదర్, తోప్రాన్ సి.ఐ. శ్రీదర్, ఆర్.యెస్.ఐ లు నరేశ్, భవానీ కుమార్, మహిపాల్, పి.ఈ.టి లు శ్యామ్, మధు, నరేశ్, వినోద్, రవి జిల్లా పోలీసు క్రీడాకారులు పాల్గొనారు.

# కోరంపల్లి గ్రామ శివారులో యెథేచ్ఛగా చెట్ల నరికివేత



**మెదక్, ఏప్రిల్ 20 (అక్షర వెలుగు):** టేక్మాల్ మండలంలోని కోరంపల్లి గ్రామ పంచాయతీ శివారులో పచ్చని చెట్లు నెల కూలుతున్నాయి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు హరితహారం మొక్కలు పెంచాలంటూ ప్రచారం చేస్తుంటే మరోవైపు పారేస్టు అధికారులు అండదండలతో భారీ వృక్షాలను నేలమట్టం చేస్తున్నారు. టేక్మాల్ మండలం కోరంపల్లి శివారులో వేప వ్యవసాయ భూమిలో తుమ్మ చేట్లను యథేచ్ఛగా భారీ వృక్షాలను నరికి వేస్తుండడంతో పలు విమర్శలు ఎదురవుతున్నాయి యధేచ్ఛగా కలుప రావాణా పాల్పడుతూ భారీ వృక్షాలను నేలమట్టం చేస్తున్నారు ఏదేమైనా పారేస్టు అధికారులు దళాలరులతో చేతులు కలిపుతున్నారు అనేందుకు ఇదో నిదర్శనం రైతులు తమ భూమిలో మా అనుమతులు లేకున్న కలుప దళారుల ఆగాడలు అంతాయింతా కాదని మండీపడుతున్నారు అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు అనే విమర్శలు వినిపిస్తున్నాయి వృక్షాలను నేలమట్టం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.




# చలన చిత్రం

# నెట్‌ఫ్లిక్స్‌లో 26నుంచి గంగూబాయ్ చిత్రం




సినీరంగంలో నటీనటులు సినిమాలలో ఎన్ని పాత్రలు చేసినా వాళ్ళ మదిలో జీవితంలో గుర్తుండి పోయే పాత్ర ఒకటి చేయాలని ఎంతగానో ఆశ పడుతుంటారు. అందులో ముఖ్యంగా నటిమణులు లేడి ఓరియెంటెడ్ పాత్రలను చేయాలని ఎక్కువగా ఆశ పడుతుంటారు. ఎందుకంటే అలాంటి పాత్రలు ఒక్కటి చేసిన ఆ పాత్ర ప్రేక్షకులలో చిరస్థాయిగా నిలిచిపోతుందనే నమ్మకం. ఇక ఇటీవలే బాలీవుడ్‌లో ఆలీయా భట్ ప్రధాన పాత్రలో నటించిన 'గంగూబాయి కతియావాడి' ఒకటి. ముంబైలోని కామటిపుర రాజ్యానికి మాఫియా క్వీన్‌గా ఎదిగిన గంగూబాయి పాత్రలో ఆలీయాభట్ నటించింది. ఈ చిత్రంలో ఆలీయా నటన వర్ణనాతీతం. ప్రేక్షకుల నుంచి విమర్శకుల వరకు ఈమె నటనకు ప్రశంసలు జల్లులు కురిపించారు. సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వం వహించిన ఈ చిత్రం డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. గంగూబాయి కతియావాడి చిత్రం ఫిబ్రవరి 25న విడుదలై భారీ కలెక్షన్లను సాధించింది. ఈ చిత్రంతో ఆలీయాభట్ 100కోట్ల క్లబ్‌లో చేరింది. ఇప్పటివరకు ఈ చిత్రం దాదాపు 130 కోట్ల నెట్ కలెక్షన్లు సాధించి రికార్డు సృష్టించింది. ఇక ఈ సినిమా ఓటీటీ విడుదల తేదీని చిత్ర బృందం తాజాగా ప్రకటించింది. ఈ చిత్రం ఏప్రిల్ 26నుంచి 'నెట్‌ఫ్లిక్స్'లో హిందీతో పాటు తెలుగులోనూ స్ట్రీమింగ్ కానుంది. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ అజయ్ దేవగన్ కీలకపాత్రలో నటించాడు.

# తల్లి ఇందిరకు మహేష్ విషెస్ వైరల్



టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు తల్లి ఇందిరా దేవి పుట్టినరోజు సందర్భంగా మహేష్ బాబు చేసిన స్పెషల్ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'హ్యాపీ బర్త్ డే అమ్మ. మీరు ఆశీర్వదించినందుకు ధన్యవాదాలు. ఒక రోజు నిజంగా సరిపోదు! ఎప్పటికి నిన్ను ప్రేమిస్తాను' అంటూ తన తల్లిపై ప్రేమను వ్యక్తం చేశారు. ఈ మేరకు తల్లి ఇందిరా దేవి ఉన్న ఫోటోను షేర్ చేశారు. ఇక మహేష్ పోస్ట్ వైరల్ కావడంతో అభిమానుల నుంచి ఇందిరా దేవికి పుట్టినరోజు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. మహేష్ తన నెక్స్ట్ మూవీ 'సర్కారు వారి పాట'తో అభిమానులను, ప్రేక్షకులను అలరించడానికి సిద్ధంగా ఉన్నాడు. పరశురామ్ పెట్ల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో మహేష్ కు జోడిగా కీర్తి సురేష్ నటిస్తోంది. ఈ సినిమా మే 12న థియేటర్లలోకి రానుంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది.

# చంద్రబాబుకు విషెస్ తెలిపిన చిరు



మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 72వ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు టాలీవుడ్ లెజండరీ హీరో మెగాస్టార్ చిరంజీవి ప్రత్యేకంగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబుకు ప్రత్యేకంగా విషెస్ తెలుపుతూ సోషల్ మీడియాలో ఓ పిక్‌ను చిరంజీవి షేర్ చేశారు. అలాగే, 'శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి జన్మ దిన శుభాకాంక్షలు? వారు కలకాలం సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఉండాలని, అలా ఆశీర్వదించమని ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను' అంటూ ట్వీట్‌లో రాసుకొచ్చారు. ఇక చిరు చేసిన ఈ ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా ఆయనకు సినీ, రాజకీయ ప్రముఖులు, టీడీపీ పార్టీ కార్యకర్తలు, అభిమానులు ప్రత్యేకంగా బర్త్ డే విషెస్ తెలుపుతున్నారు. చిరంజీవి.. తనయుడు రామ్ చరణ్‌తో కలిసి నటించిన 'ఆచార్య' చిత్రం ఏప్రిల్ 29న విడుదలకు సిద్ధమవుతోంది. పూజాహెగ్డే, కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటించారు. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

# దర్శకుడు తాతినేని రామారావు మృతి



ప్రముఖ సినీ దర్శకుడు తాతినేని రామారావు మృతి చెందారు. గతకొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో చెన్నైలోని శ్రీరామచంద్ర మెడికల్ కళాశాల ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అర్ధరాత్రి తుదిశ్వాస విడిచారు. తాతినేని రామారావు.. హిందీ, తెలుగు భాషల్లో దాదాపుగా 80 చిత్రాలకి దర్శకత్వం వహించారు. 1966 లో నవరాత్రి చిత్రంతో దర్శకుడిగా కెరీర్ ప్రారంభించిన ఆయన .. ఎన్టీఆర్ రామారావుతో యమగోల, రాజేంద్రప్రసాద్‌తో గోల్ మాల్ గోవిందం, సూపర్ స్టార్ కృష్ణతో అగ్ని కెరటాలు వంటి సూపర్ హిట్ చిత్రాలకి దర్శకత్వం వహించారు. తాతినేని రామరావు మృతిపట్ల సినీ ప్రముఖులు సంతాపం తెలుపుతున్నారు. 938లో కృష్ణాజిల్లా, కపిలేశ్వరపురంలో తాతినేని రామారావు జన్మించారు. అప్పటి ప్రముఖ దర్శకుడు తాతినేని ప్రకాశ్‌రావుకు అడుగుపెట్టి ప్రకాశ్‌రావు వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా కొన్నేళ్ళపాటు పనిచేశారు. దర్శకత్వంపై అవగాహన వచ్చిన తర్వాత అక్కినేని నాగేశ్వరరావు, సావిత్రి కలయికలో 'నవరాత్రి' అనే చిత్రానికి దర్శకత్వం వహించే అవకాశం అందుకున్నారు. దర్శకుడిగా మొదటి సినిమాతోనే మంచి విజయం దక్కడంతో ఆ తర్వాత తెలుగులో అప్పటి స్టార్ హీరోలతో కలిసి వరుసగా సినిమాలు చేశారు. 'బ్రహ్మచారి', 'మంచి మిత్రులు', 'జీవన తరంగాలు', 'దొరబాబు', 'యమగోల', 'అనురాగ దేవత', 'పచ్చని కాపురం' వంటి చిత్రాలకు ఆయన దర్శకత్వం వహించారు. ఎన్టీఆర్ హీరోగా నటించిన 'యమగోల' చిత్రం తాతినేని రామారావుకు మంచి గుర్తింపు తెచ్చింది. అదే చిత్రాన్ని 1979లో హిందీలోకి 'లోక్ పర్‌లోక్' పేరుతో రీమేక్ చేసి బాలీవుడ్‌లోనూ మొదటి చిత్రంతోనే మంచి హిట్ అందుకున్నారు.

# అంటే సుందరానికీ.. ఆకట్టుకుంటున్న టీజర్




నాని నటించిన లేటెస్ట్ మూవీ 'అంటే సుందరానికీ'. వివేక్ ఆత్రేయా దర్శకత్వం వహించాడు. మొదటి నుంచే ఈ సినిమాపైన ప్రేక్షకులలో మంచి అంచనాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో తాజాగా ఈ చిత్ర టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. 'సుందర్ ప్రసాద్ మీ అబ్బాయే కదండి.. అవునండి వాడే మా వంశోద్ధారకుడు' అంటూ టీజర్ ప్రారంభమైంది. పంచకట్టులో ఉన్న నానిని చూసి హర్షవర్ధన్ చమత్కారంగా 'దెబ్బ తగిలి ఈ డ్రెస్ వేసుకున్నావా.. డ్రెస్ వేసుకున్నాక దెబ్బతగిలిందా' అని అడుగుతాడు. దానికి నాని 'మా ఇంట్లో ఆచారం ప్రకారం ఎవరు సముద్రం దాటి వెళ్ళివచ్చిన రెండు రోజులు అందరు ఇలాగే వేసుకుని తిరుగుతారు.. చాలా సార్ అంటూ' కోపంగా చెప్పే సమాధానం వాళ్ళ ఆచారాలు నానికి ఇబ్బంది కలిగిస్తున్నట్లు తెలుస్తుంది. 'బాబుకు అసలు బాలేదండి.. చూడండి వైకుంఠపాళిలో పాముల్లాగా ఉన్నాయి గండాలు.. ఒకటి దాటితే ఇంకోటి' అంటూ నీకు ద్విచక్ర వాహన గండం ఉందంట అంటూ నరేష్ చెప్పగా ద్విచక్ర వాహన గండం ఏంటమ్మా, రోడ్డు మీద గుంటుంటే అది నా తప్ప అస్సలు ప్రపంచంలో ఏ కుర్రాడైనా ఇలాంటి బండేసుకుని తిరుగుతాడా.. అంటూ స్కూటర్‌ను తన్నడం వంటివి నాని ఫ్రస్టేషన్‌ను తెలుపుతున్నాయి. 'నాన్న గురించి తెలియదా నీకు.. మీ ఇద్దరి పెళ్ళి విషయంలో డెసీషన్ నాదే' అంటూ వచ్చిన డైలాగ్స్ నజ్రియా ఫాదర్ ఎంత స్ట్రిక్ట్ అనేది తెలుస్తుంది. 'ఏంటి నవ్వావా.. ఇంకొంచెం నవ్వితే ఇటు వైపు లైట్స్ అన్ని ఆర్పేస్తారు.. మా వాడికి కూడా కరెంట్ సేవ్ అవుతుంది' అంటూ నాని రొమాంటిక్‌గా చెప్పే సంభాషణలు ఆకట్టుకుంటున్నాయి. ఈ చిత్రంలో నాని బ్రహ్మణుడిగా , నజ్రియా క్రిస్టియన్‌గా నటించింది. వీళ్ళిద్దరి ప్రేమకు ఇంట్లో వాళ్ళు ఒప్పుకుంటారా? లేదా? అనే నేపథ్యంలో ఈ చిత్రం ఉండనున్నట్లు తెలుస్తుంది. టీజర్ చివర్లో నీకింకా అసలు విషయం చెప్పలేదు? అంటూ నాని, హర్షవర్ధన్‌కు చెప్పే డైలాగ్ సినిమాపై క్యూరియాసిటీని పెంచుతుంది. మైత్రి మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని జూన్ 10న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇదివరకే ప్రకటించారు. తెలుగుతో పాటు తమిళ, మలయాళ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **GPR PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
TITLE CODE.TELTEL02057, Cell:8464816456 Email: aksharavelugudaily@gmail.com, Website: www.aksharavelugu.com